1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

బుధవారం | 25 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలంలోని చింతకుంట గ్రామంలో వరి పరిశోధనా స్థానం రాజేంద్రనగర్, ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు, జోగిపేట వ్యవసాయ శాఖ అధికారులు పంట పొలాలను సందర్శించారు. సెప్టెంబర్ నెలలో కురిసిన అధికవర్షాల కారణంగా పంటలకు చీడ పీడలు ఆశించాయన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత గుర్తించినట్టు చెప్పారు. వాటి నివారణకు క్లోరంత్రోనిలిప్రోల్ 60 మిల్లీ గ్రాములు ఎకరానికి లేదా కాల్డాన్ 400 గ్రాములు ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. మందులని చిరు పొట్ట దశలో పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అందోలు డివిజన్ ఎడిఏ రమాదేవి,మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్ గోపాల్ వర్మ, డాక్టర్ కిరణ్ బాబు, కే సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీతో కలుషితమయ్యే ప్రాంతాలపై ఆరా



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఫార్మాసిటీ కంపెనీల వల్ల మంజీరా బ్యాక్ వాటర్ చెరువులు కలుషితం అవుతాయని.. భూ బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో డప్పుర్ , చినిగేపల్లి, చెరువులు, మంజీరా నీటి కలుషితం అయ్యే ముంపు ప్రాంతాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు గీత, రెవెన్యూ ఉప తాసిల్దార్ రాజిరెడ్డి, అధికారులు పలువురు రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఫార్మాసిటీ కంపెనీల వల్ల మంజీరా నీరు కలుషితమై తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు, స్థానికలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తనిఖీకి వచ్చిన వారిలో ఆర్‌ఐ శ్యామ్ రావు, సర్వేయర్ లాల్‌సింగ్, భూ బాధిత నాయకులు డప్పుర్ రవీందర్, కిరణ్ కుమార్ గౌడ్, రవికుమార్, సుభాష్ సేట్, రవి గౌడ్, నాగన్న, పలువురు రైతులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే పచ్చదనం



నవతెలంగాణ-వట్‌పల్లి

పరిసరాల పరిశుభ్రతతోనే పచ్చదనం నెలకొంటుందని.. ప్రతీ వీధి లోను స్వచ్చతా హి సేవ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో నిర్వహించిన మంగళవారం నిర్వహించిన స్వచ్చత హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వచ్చతా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో స్పోర్ట్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో రామలింగం, ఎంపీఓ ఖాజా నసీరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-కంది

కులబ్‌గూర్ శివారులో గల రాఘవేంద్ర రైస్‌మిల్ ఎదుట సంగారెడ్డి నుంచి జోగిపేట్ వెళ్లే రోడ్డు పక్కన సోమవారం రాత్రి సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. వారు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుని వయస్సు 30 నుంచి 35 ఏండ్ల మధ్య ఉంటుందని.. చామనఛాయ రంగులో ఉండి ఎత్తు 5."4" ఇంచులు కలిగి నల్లని వెంట్రుకలు కలిగి ఉన్నాడని.. ఎరుపు రంగు ఫుల్ షర్టు, గ్రే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహం ఆసుపత్రి మార్చురీలో ఉన్నదని.. మృతుని వివరాలు తెలిస్తే రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐపి 8712656746కి లేదా సిఐపి 8712656719ని సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-సదాశివపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్సే రైటింగ్, వాలంటీర్లతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా దృక్పథంతో.. సమాజాభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆఫీసర్ పి. మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు, కళాశాల ఇతర లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలి వెళ్లిన డీలర్లు



నవతెలంగాణ-న్యాల్‌కల్

పటాన్‌చెరువులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సంఘం బహిరంగ సభకు న్యాల్‌కల్ మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గౌరవ వేతనం, కమిషన్ పెంపు, రేషన్ డీలర్ల హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో డీలర్ల మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి , జమీల్ , మాణిక్, ప్రణీత్ , సంగన్న, శానవాజ్ , రహిమెద్దీన్, శివ కుమార్ , ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిర మహిళా శక్తి టార్గెట్ పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఝరాసంగం

ఇందిరా మహిళా శక్తి,మైక్రో ఎంటర్ప్రైజెస్ టార్గెట్ పూర్తి చేయాలని డీపీఎం జయశ్రీరాజ్ అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఝరాసంగం, రాయికోడ్ మండలాల సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెల వరకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం యూనిట్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలన్నారు. లేని పక్షంలో సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం స్థానిక డీసీసీబి బ్యాంక్ను సందర్శించి మండలానికి మంజూరైన మహిళా క్యాంటీన్కు సంబందించి మేనేజర్తో మాట్లాడి త్వరగా లోన్ మంజూరయ్యేలా చూడాలన్నారు. పీఎమ్ఎఫ్ఎమ్ఇ కింద మంజూరైన యూనిట్ లెటర్ను లబ్దిదారుకు అందజేశారు. ఏపీఎం బాలక్రిష్ణ, బ్యాంక్మేనేజర్,సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారంలో దంచి కొట్టిన వర్షం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో మంగళవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. దాదాపు గంటకు పైగా వర్షం ఏకధాటిగా పడింది. గడిచిన నాలుగైదు రోజులుగా దంచి కొట్టిన ఎండలకు వర్షంతో వాతావరణం చల్లబడింది.


ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.ఈ ఘటన మండలంలోని రామ్‌తీర్థంలో మంగళవారం జరిగింది. హద్నూర్ ఎస్సై రాము నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాథరి నర్సింలు గత నెల రోజుల నుంచి మతిస్థిమి తం సరి గ్గా లేని విధంగా ప్రవర్తిస్తున్నాడు. ఈక్రంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి న అత డు తిరిగి రాలేదు. దాంతో అతని కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఏర్పాట్లు



నవతెలంగాణ-సంగారెడ్డి

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లా లతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజ కవర్గాలకు చెందిన అర్హత కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కు వినియో గించుకునేందుకు వీలుగా ఓటరు జాబి తాలో పేర్ల నమోదు కోసం ఈనెల (సెప్టెంబర్) 30 నుండి దరఖాస్తులు చేసుకో వచ్చని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. ఆయా జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ స్థానంతో పాటు, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానం నుండి ప్రాతినిధ్యం వహి స్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎలక్షన్ కమిషన్ అర్హత కలిగిన ఓటర్లకు పేర్ల నమోదు కోసం అవకాశం కల్పిస్తూ ఈనెల 30న పబ్లిక్ నోటీసును జారీ చేయనుందన్నారు. 2024 నవంబర్ 06 వ తేదీ వరకు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకో వాలని, ఏఈఆర్ఓ కార్యాలయాల్లో నేరుగా కూడా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నందారం గ్రామ పరిధిలోని జాల్బాయ్ తండాలో గుగులోతు తిరుపతి (28) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడు కొండాపూర్ గ్రామ పరిధిలోని జీవురాల తండాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాడి రైతు కుదేలు





- బిల్లులు రాక ఇబ్బందులు
- పాల ఉత్పత్తిదారులకు అందని ప్రోత్సహకాలు
- చాలా పరిమితమైన గ్రామాల్లో పాల కేంద్రాలు
- సంగారెడ్డి జిల్లాలో నిత్యం పది వేల లీటర్ల సేకరణ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయ రంగంలో పాల ఉత్పత్తికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డైయిరీ) నుంచి మరిన్ని ప్రోత్సహకాలు అందించడంతో పాటు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పాడి రైతులు కుదేలవుతున్నారు. పాడి పరిశ్రమాభివృద్ధికి రాయితీలు ఇవ్వడం, డైయిరీ ఏర్పాట్లకు ఆర్థిక సాయం పెరగట్లేదు. పాల వినియోగం పెరుగుతున్నా పాడి రైతులు, పాల ఉత్పత్తి మాత్రం ఆ మేరకు పెరగట్లేదు. ఫలితంగా మల్టీ నేషనల్, దేశీయ పాల పౌడర్ పాలు మార్కెట్‌ల్లో అధికమవుతున్నాయి. ప్రయివేట్ డైయిరీలకు పోటీగా విజయ డైయిరీ పాల సేకరణను పెంచుకోవాలి. ఉత్పత్తిదారులకు అధికాదాయం సమకూరేందుకు ప్రోత్సాహాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయం లేక పాల ఉత్పత్తిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజలకు నాణ్యమైన, స్వచ్చమైన పాలు అందించే బాధ్యతను ప్రభుత్వ డైయిరీపై ఉన్నప్పటికీ ఆ దిశగా పయనించడంలేదు.

పాల సేకరణ పెంచేందుకు ప్రయత్నం

సంగారెడ్డి జిల్లాలో ప్రతి రోజూ 22 రూట్లలో 149 పాల సేకరణ కేంద్రాల్లో 4892 మంది పాల ఉత్పత్తిదారుల నుండి పాలను కొనుగోలు చేస్తున్నారు. చిన్న తరహా పాల శీతలీకరణ కేంద్రాలతో పాటు జహీరాబాద్, నారాయణఖేడ్, పుల్కల్‌లో శీతలీకరణ కేంద్రాలున్నాయి. 18 కేంద్రాల్లో విజయ పార్లర్లు ఉన్నాయి. 107 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలున్నాయి. జిల్లాలో రోజుకు 25 వేల లీటర్ల పాలను సేకరిస్తూ 20 వేల లీటర్ల పాలను విక్రయిస్తుండేది. ప్రతి రోజూ 30 వేల లీటర్ల వరకు పాల సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని సంగారెడ్డి జిల్లా విజయ డైయిరీ సంస్థ ఆ దిశగా లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది. ప్రస్తుతం రోజుకు 10500 లీటర్లు మాత్రమే రోజూ సేకరిస్తున్నారు. మెదక్ జిల్లాలో 16 మండలాల్లోని 132 గ్రామాల్లో పాలసేకరణ జరుగుతోంది. 48 పాల ఉత్పత్తిదారల సహకార సంఘాలున్నాయి. 24 రూట్లల్లో 3492 మంది పాల ఉత్పత్తిదారుల నుండి ప్రతి రోజూ పది వేల లీటర్ల పాలను సేకరిస్తూ ఐదు వేల లీటర్ల వరకు విక్రయిస్తున్నారు. మెదక్ డైయిరీ, పాపన్నపేట, శంకరంపేట, రేగోడ్, కౌడిపల్లి, చేగుంట, రామాయంపేటలో పాల శీతలీకరణ కేంద్రాలున్నాయి. జిల్లాలో రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా ప్రోత్సహకాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆ దిశగా ప్రగతి సాధించలేదు. సిద్దిపేట జిల్లాలోనూ 28 రూట్లల్లో 150 గ్రామాల నుంచి 3400 వేల మంది పాల ఉత్పత్తిదారల నుంచి నిత్యం పాలను 20 వేల లీటర్లను సేకరిస్తున్నారు.

బిల్లులు అందక ఇబ్బందులు

పాల ఉత్పత్తిదారులకు బిల్లులు చెల్లించడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. మదర్ డైయిరీ రైతుల నుంచి సేకరించిన పాలకు నిర్ణయించిన ధర ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలి. నెలలో రెండు సార్లు బిల్లులు అందడం వల్ల రైతులకు పాడి పశువుల పోషణ, దాణా ఇతర ఖర్చులకు ఉపయోగపడేది. జూన్ వరకు బిల్లులు అందినప్పటికీ జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో మాత్రం బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. మూడు జిల్లాల్లోనూ మదర్ డైయిరీ పాల సేకరణలో పాలు పోస్తున్న రైతులు బిల్లులందకపోవడంతో అప్పులు చేస్తున్నారు.

పాల ధర పెంపు కొంతే

తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య రైతుల్ని ప్రోత్సహించేందుకు ఇటీవల పాల సేకరణ ధరను పెంచింది. 5 శాతం వెన్నతో కూడిన పాలకు రూ.36.50 నుంచి రూ.40.40 పెరిగింది. జూన్ నుంచి ధర పెరగడంతో ఫుల్ క్రీమ్ మిల్క్ లీటర్ ధర రూ.68 ఉంది. లోన్డ్, డబుల్ స్టోన్డ్ మిల్క్ లీటర్ ధర రూ.56 ఉంది. 12 శాతం వెన్న ఉన్న పాలకు గతంలో లీటర్‌కు రూ.87.60 ధర ఉండగా ప్రస్తుతం 91.60 పెరిగింది. ఆవు పాలు లీటర్‌కు రూ.72 వరకు ఇస్తున్నారు.

రైతులకు కొన్ని ప్రోత్సహకాలు

ఇప్పటికే రాష్ట ప్రభుత్వం రైతులకు కొన్ని ప్రోత్సహకాలు కల్పిస్తుంది. లీటర్ పాలపై రూ.4 చొప్పున ప్రోత్సహకాన్ని అందజేస్తోంది. సంస్థకు క్రమం తప్పకుండా పాలను సరఫరా చేసే ఉత్పత్తిదారులు వారి కుటుంబాల సంక్షేమం కోసం కూడా వివిధ రకాల పథకాలను అమలు చేస్తున్నారు. ఉత్పత్తిదారుల కుటుంబాల్లో వివాహాలు జరిగితే విజయ డైయిరీ పెళ్లి కానుకగా రూ.5 వేలు ఇస్తున్నారు. విజయ విద్యా కానుకగా ఎస్ఎస్‌సీలో 9 జీపీఏ వస్తే రూ.వెయ్యి, జేఈఈల్లో, ఎంసెట్, నీట్‌లో ర్యాంకులు సాధించి మెడికల్, ఐఐటీ, జేఈఈల్లో ప్రవేశాలు పొందిన వారికి రూ.2 వేల నగదు అందజేస్తున్నారు. ఈ సహాయాన్ని విద్యార్థి చదువుకు ఉపయోగపడే విధంగా ఉండేందుకు కనీసం రూ.10 వేల సాయం చేయాలని పలువురు కోరుతున్నారు. ఉత్పత్తిదారుల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.5 వేలు సాయం చేస్తున్నారు. విజయ లోగోతో స్టీలు పాలక్యాన్లను అందిస్తున్నారు. నాణ్యమైన పాలను పోసే వారికి అవార్డులు, పాడి పశువుల సంరక్షణకు వైద్య శిబిరాలు, పాడి గేదెల కొనుగోలుకు రుణాలు, దాణా సబ్సిడీ బస్తాకు రూ.300, గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. పాడి రైతులకు వారం వారం బిల్లులు చెల్లించడం, రైతుల పేరిట బ్యాంకు ఖాతాల్లో వేయడం జరగాలి. పాడి పశువుల కొనుగోలు కోసం ప్రస్తుతం రూ.10 వేల సబ్సిడీ మాత్రమే ఇస్తున్నారు. పశువు ధరలో 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని పలువురు పాల ఉత్పత్తిదారులు కోరుతున్నారు. పాడి పరిశ్రమకు ప్రత్యేక నిధులు కేటాయించి వ్యవసాయం రంగంలో రైతు బీమా, రైతు బంధు మాదిరిగా పాల ఉత్పత్తిదారులైన రైతులకు కూడా వర్తించే పథకాలను అమలు చేయాలని పాడి రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉత్పత్తిదారుల సంక్షేమమే ముఖ్యం

గోపాల్‌సింగ్,విజయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ డీడీ

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వం పాడి పరిశ్రమాభివృద్ధికి పాల్పడుతోంది. ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర ఇవ్వడం, ఇతర రాయితీలు కొనసాగించడం జరుగుతోంది. మార్కెట్ అవసరాలను గుర్తించి పాల్పఉత్పత్తుల్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కట్టుదిట్టంగా ఓటరు జాబితా సవరణ

సీఈఓ సుదర్శన్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కట్టుదిట్టంగా చేపడుతూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్ఓ నెట్ 2.0 తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమయ్యిందని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుండి 95 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్లు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ లు, సూపర్వైజర్లను అభినంది ంచారు. అయితే మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున గడువులోపు ఇంటింటి సర్వేను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు తప్పనిసరిగా ప్రతి ఇంటిని, తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పక సందర్శించాలని, తద్వారా ఓటరు జాబితాలో ఎలాంటి సాంకేతిక తప్పిదాలు చోటుచే సుకునేందుకు అవకాశం ఉండదని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్దీకరణ ప్రక్రియను ఓటరు ముసాయిదా జాబితా వెలువరించడానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం కొనసాగుతున్న ప్రదేశాన్ని తెలియజేసేలా ఫోటోలను బీఎల్ఓ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. అదేవిధంగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబం ధించి పెండింగ్ ఉన్న ఫారం 6, ఫారం 6 ఏ, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలన జరపాలని సూచి ంచారు. కాగా, ఇంటింటి సర్వేలో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదన్నారు.మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ -కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానాలతో పాటు, ఖమ్మం నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ స్థానాల పరిధిలోని ఓటర్ల పేర్ల నమోదు కోసం ఈ నెల 30న పబ్లిక్ నోటీస్ జారీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, రెవిన్యూ అదనపు కలెక్టర్ మాధురి, ఆర్ డీఓలు తహసీల్దార్‌లు, ఎన్నికల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా సేవలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-జోగిపేట

మండల పరిధిలోని నేరగుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాలు పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్ కుమార్, ఎంపీఓ అశోక్, ఎంఈఓ కృష్ణ, కార్యదర్శి నరసింహస్వామి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల గౌరవ వేతనమివ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేష్

కంది బస్టాండ్ వద్ద దీక్ష..

నవతెలంగాణ-కంది



కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని..నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ ఉద్యోగులను, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ సంగారెడ్డి క్లస్టర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కంది బస్టాండ్ వద్ద మంగళవారం దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేష్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో దాదాపు 1710 పరిశ్రమల్లో రెండు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అందులో లక్ష అరవై వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని చట్టం ఉన్నప్పటికీ.. యాజమాన్యాలకు పట్టడం లేదన్నారు. ఐదేండ్ల కొకసారి పెరుగు తున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని నిబంధనలు ఉన్నా.. గత 18 ఏండ్ల నుంచి పాలకులకు కార్మికుల కష్టాలు, వేతనాలు పట్టడం లేదని విమర్శించారు. జిల్లాలో 70 వేల మంది వలస కార్మికులు ఉన్నారని.. అయినా 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలు కావడం లేదన్నారు. దాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాన్‌పర్మిట్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ ఉద్యోగులను కార్మికులను పర్మిట్ చేయాలని, పెరుగుతున్న ధరలు కనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్, గ్రాట్యూటీ, చట్టపరమైన సౌకర్యాల అమలు చేయాలన్నారు. లేని యెడల కలెక్టర్, డీసీఎల్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న జరిగే కలెక్టర్ ఆఫీస్ ముట్టడి, ధర్నాలో పెద్దఎత్తున కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు నాయకులు పి. బాగారెడ్డి, సురేష్, మల్లేష్, భీమ్ రెడ్డి,ప్రవీణ్ ,సత్తయ్య ,సత్యం దావీదు, సురేష్, శివ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైజాంకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే

ఎర్రజెండా పోరు వల్లే తెలంగాణకు విముక్తి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు. జి సాయిలు

ఆకట్టుకున్న తెలంగాణ రైతాగ పోరాట వీధి నాటకం

నవతెలంగాణ-జోగిపేట



నైజంకు వ్యతిరేకంగా పోరాటాలు చేసింది ఎర్రజెండా కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. సాయిలు అన్నారు. జోగిపేటలోని క్లాక్ టవర్ వద్ద ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రైతాంగ పోరాట వీధి నాటక శౌర్య యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 11 జిల్లాలోని మద్రాసు, మహారాష్ట్ర, విజయవాడ, హైదరాబాదు ప్రాంతాల్లో నైజాం రాజు పెద్ద ఎత్తున అరాచకాలకు, ఆకృత్యాలకు పాల్పడితే ఇది సహించలేమని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, తెలంగాణ ప్రజల విముక్తి కోసం నైజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసింది ఎర్రజెండానే అన్నారు. 1946 సెప్టెంబరు 11న నిజాం కు వ్యతిరేకంగా తెలంగాణ పౌరులందరం ఐక్యం కావాలని, నైజాంను తరిమి కొట్టాలని 1930లో ఇదే గడ్డ జోగిపేటలో మొట్టమొదటి తొలి ఆంధ్ర మహాసభకు పురుడు పోసుకుందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం నాడు జోగిపేటలో ప్రారంభమైన పోరాటం 1951 వరకు కొనసాగిందన్నారు. ఖాసీం రజ్వి, దొర రామచంద్రరెడ్డిలు ఊర్లలో పడి చిట్యాల ఐలమ్మ పంట పొలాలను తీసుకెళ్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. ఆమెకు అండగా దొడ్డి కొమరయ్య నిలిచారన్నారు. నైజాం, రామచంద్రరెడ్డిలు తమ సైన్యాలతో దొడ్డి కొమరయ్యను కాల్చి చంపినా.. కమ్యూనిస్టులు మాత్రం ఉద్యమాన్ని ఆపలేరని గుర్తు చేశారు. తెలంగాణను విలీనం చేసింది ఒక్క కమ్యూనిస్టులు తప్ప మరెవ్వరూ కాదన్నారు. తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వీధి నాటకం ద్వారా కమ్యూనిస్టుల పాత్రను ప్రజానాట్యమండలి కళ్లకు కట్టినట్టు చూపించడం జరిగిందని వారిని అభినందించారు. తెలంగాణ రైతాంగ పోరాట స్పూర్తితో దేశంలోని పౌరులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వీధి నాటికను ప్రజానాట్యమండలి కళాకారులు చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డి. విద్యాసాగర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు అంజనేయులు, కార్యదర్శి ఏ. నాగభూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, నాయకులు సురేష్, రాములు, పెంటయ్య ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, రాష్ట్ర నాయకులు ఎర్పుల వెంకన్న, చంద్ర మౌళి, గంతేపాక శివ, గంటెపాక శ్రీ కృష్ణ, నరేష్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం సుడిగాలి పర్యటన

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని క్రీడాకారులు, విద్యార్థిని, విద్యార్థులు ఉపయోగించుకోవాలని, క్రీడాకారులకు మినీ స్టేడియం ఒక వరం లాంటిదని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో పర్యటించిన మంత్రి మినీ స్టేడియాన్ని సందర్శించారు. క్రీడాకారులతో కలిసి మంత్రి బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం క్రీడాకారులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై క్రీడాకారులు, పీఈటీల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిస్తే వారికి మంచి పారితోషికం అందిస్తామన్నారు. విద్యార్థులు చదువులు, ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, ఇంకా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పదవ తరగతిలో రాష్ట్రంలోనే హుస్నాబాద్ ప్రథమ స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజి రోడ్డును, ప్రాంగణాన్ని పరిశీలించారు. వర్షానికి డిగ్రీ కాలేజి భవనం ప్రమాదానికి గురవుతుండడంతో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం గిరిజన బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. హాస్టల్‌కి కాంపౌండ్ వాల్ కావాలని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకు రాగా, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వ్యర్థాలను తొలగిస్తేనే గణేష్ ఉత్సవాలకు పరిపూర్ణత

రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ నిమజ్జనం తరువాత చెరువులో వ్యర్థాలను తొలగించిన తరువాతనే గణేష్ ఉత్సవాలకు పరిపూర్ణత వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద స్వచ్చత హి సేవ-2024 కార్యక్రమంలో మంత్రి పాల్గొని చెరువులో నిమజ్జనం తరువాత ఉన్న వ్యర్థాలను స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. హుస్నాబాద్‌ను స్వచ్ఛ హుస్నాబాద్ గా మార్చుకోవడానికి మున్సిపల్ సిబ్బంది పని చేస్తున్నారని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మెన్ అనిత రెడ్డి , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో ఏడుపాయల ఆలయం

నవ తెలంగాణ-పాపన్నపేట



సింగూరు ప్రాజెక్ట్, వన దుర్గ ప్రాజెక్ట్ పరవళ్ళు తొక్కుతూ పొంగిపొర్లుతున్నాయి . మంజీరా నది పాయలు పరవళ్ళు తొక్కుతున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సింగూరుకు వరద పెరగడంతో ప్రాజెక్టులోకి 29.708టీఎంసీల నీరు చేరింది. దీంతో సోమవారం 11వ గేటు ద్వారా దిగువకు 8142 క్యూసెక్కుల నీటిని వదిలారు. దిగువకు నీరు వస్తుండడంతో వనదుర్గామాత ఆలయ సమీపంలో ఉన్న 30 శతకోటి ఘనపుటడుగుల వనదుర్గా ప్రాజెక్టు పూర్తిగా పొంగిపొర్లుతోంది. ప్రాజెక్టుపై నుంచి గంగమ్మ పరవళ్లు తొక్కుతూ, వనదుర్గామాత ఆలయం ముందున్న నదీపాయ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వన దుర్గామాత ప్రధాన ఆలయాన్ని గంగమ్మ చుట్టుముట్టేసింది. ఆలయ సిబ్బంది, అర్చకులు, పోలీసు సిబ్బంది వనదుర్గామాత ప్రధాన ఆలయాన్ని మంగళవారం ఉదయం నుంచి తాత్కాలికంగా మూసివేసి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టగానే అమ్మవారి దర్శనం యథావిధిగా కొనసాగుతుందని వారు తెలిపారు. ఇదిలా ఉండగా వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి వనదుర్గామాత ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకోవడం ఇది మూడోసారి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మూలవిరట్ అమ్మవారి దర్శనం కాకపోవడంతో రాజగోపురంలో ప్రతిష్టించిన ఉత్సవిగ్రహాన్ని దర్శించుకుని వెళుతున్నారు. మంజీరా నది ఉధృతంగా ప్రవహించడంతో పాపన్నపేట పోలీసులు భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాఘవ ఆసుపత్రి వద్ద అన్నదానం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట రాఘవ హాస్పిటల్ ఫౌండర్ దివంగత గుండ జనార్ధన్ స్మారకార్థం మంగళవారం స్థానిక రాఘవ హాస్పిటల్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జోగిపేట పట్టణంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు దాదాపుగా 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కు చెందిన డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సాయిదీప్ మున్సిపల్ కౌన్సిలర్స్ కొరబోయిన నాగరాజ్, చందర్ నాయక్, మాజీ ఎంపిటిసి డిజి. వెంకటేశం, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, మాజీ వార్డ్ మెంబర్ పట్లోళ్ల ప్రవీణ్, శ్రీనివాస్,మధు, రాజు, మోదిని రాజు, అనిల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

రోడ్డుపై చెత్త వేయకుండా పారిశుధ్య సిబ్బందికి పట్టణంలోని వ్యాపారవేత్తలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మున్సిపల్ కార్మికులు.. వర్తక వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి ఉదయం, సాయంత్రం పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.. కాబట్టి వారికి వ్యాపారవేత్తలు సహకరించి చెత్తను మున్సిపల్ వాహనాల్లో మాత్రమే వేయాలన్నారు. ఎంత చెప్పినప్పటికీ కొందరు వ్యాపారవేత్తలు మురుగునీటి కాలువల్లో చెత్తను పారేస్తున్నారని.. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి అలా కాకుండా చెత్తను సంచుల్లో నింపి మున్సిపల్ వాహనాలకు అందజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి.. వారికి నోటీసులు కూడా పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంధ్యారాణి, రాజ్ కుమార్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఉత్తర్వుల మేరకు ఈనెల 28న దేశవ్యాప్తంగా లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కక్షిదారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు వినియోగించుకొని కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ మార్గాన పరిష్కరించుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 138 ఎన్ఐ యాక్ట్ కేసులు, మోటార్ వాహన ప్రమాదం నష్టపరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఆస్తి తగాదాలు, బ్యాంక్ రికవరీ, టెలిఫోన్ రికవరీ, ఎస్ఏటిపి, రెవెన్యూ, విద్యుత్ విద్యుత్ చౌర్యం, ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఈనెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని.. కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించు కోవాలని కోరారు.

రాజేందర్, నర్సింలును పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

అనారోగ్యంతో బాధపడుతూ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లిపూర్ మాజీ ఎంపీటీసీ రాజేందర్, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నదిమి దొడ్డి నర్సింలును ఎమ్మెల్యే మాణిక్‌రావు మంగళవారం పరామర్శించారు.వారు త్వరగా కోలుకోవాలని.. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.

యోగా ట్రైయినర్ల పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్స్‌లో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ సెంటర్లలో కాంట్రాక్టు పద్ధతిన యోగా ట్రెయినర్లను నియమించనున్నట్టు ఆయుష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో రేపు(గురువారం) ఉదయం 10:00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. సంగారెడ్డిలో పురుషులకు (15), మహిళలకు (15).. మొత్తం 30 పోస్టులు నియమించనున్నట్టు తెలిపారు. మరిని వివరాలకు https://ayush.telangan.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

పథకాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి వర్కర్లు అందరూ సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని లచ్చునాయక్ తాండా అంగన్వాడి కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఐసిడిఎస్ పథకం ద్వారా గ్రామంలోని వికలాంగుడికి మంజూరైన చెక్కులను అందించారు. అంగన్వాడీలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులను చూసి వారిని అభినందించారు. అంగన్వాడి టీచర్, పంచాయత్ కార్యదర్శులు పని విధానం పట్ల గ్రామస్తులను అడిగి తెలుసుకుని వారిని అభినందించారు.

పట్టణం పరిశుభ్రంగా ఉండాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మున్సిపల్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ రామ్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం డంపింగ్ యార్డ్‌లో ప్రహరీ గోడ చుట్టూ మొక్కలను నాటారు. అలాగే ప్రోసెసింగ్ ప్లాంట్‌లను శుభ్రపరిచారు. పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలని.. సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు సూచించారు. అనంతరం పబ్లిక్ టాయిలెట్‌ల నిర్వహకులకు తగు స్వచ్ఛత సూచనలను తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలోనే డీఎల్పీఓ సేవలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో డీఎల్పిఓ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడంతో.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే సేవలు అందించనున్నట్టు డీఎల్పిఓ వసంత కుమారికి తెలిపారు. జహీరాబాద్ డివిజన్‌గా ఏర్పాటు చేసినప్పటికీ నాటి నుంచి సంగారెడ్డి డీఎల్పీఓ కార్యాలయం నుండే సేవలు అందిస్తూ వారానికి ఒకటి రెండుసార్లు జహీరాబాద్ డివిజన్లో పర్యటనలు చేస్తున్నట్టు చెప్పారు. కాగా డీఎల్పీఓ కార్యాలయంతో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్, సిబ్బందిని వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ బృందాలకు ముగిసిన శిక్షణ



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని చెట్లపోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండ్రోలపాటు ఉపాధ్యాయ బృందాలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ అవగాహన శిబిరంలో జిల్లా సీఎమ్ఓ వెంకటేశం వివిధ అంశాల వారీగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సమగ్ర శిక్ష అభియాన్ మార్గదర్శకాల మేరకు యాప్‌లో 21 అంగవైకల్య పరిస్థితుల ఆధారిత స్క్రీనింగ్ అంశాలపై సంబంధిత విషయాలను శిక్షణ వివరిస్తూ ఇది ఒక ఫ్లాట్ షిప్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం అని ఉపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో మండల ఎంఎస్ఓ కుమారస్వామి, వావిలాల హెచ్ఎం విజయ్ కుమార్, ఆర్పి రవికుమార్, ఉపాధ్యాయ బృందాలు సిబ్బంది పాల్గొన్నారు.

డీడీఎస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ అభయాన్



నవతెలంగాణ-జహీరాబాద్

డీడీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛ అభయాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వేస్టేషన్ మాస్టర్ మాధవన్ కృష్ణ, డీడీఎస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొని పారిశుధ్యం గురించి ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న పరిసరాలను శుభ్రపరిచి పారిశుధ్యం వల్ల రోగాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయం రెండు నెలల హుండీ లెక్కింపును జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి శివరాజ్, కార్యనిర్వాహణ అధికారి ఉప్పల శశిధర్, గ్రామ పెద్దల పర్యవేక్షణలో కామారెడ్డి రాజరాజేశ్వరి సేవా సమితి వారితో మంగళవారం నిర్వహించారు. వివిధ దేశాల కరెన్సీ నోట్లు కూడా హుండీలో వచ్చినట్లు వారు తెలిపారు. కాగా హుండీ పూర్తి ఆదాయం రూ.18,23,572, అన్నదాన హుండీ ఆదాయం రూ.51,604 వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మద్ది ప్రతాపరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, భాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు, భక్తులు, దేవస్థానం సిబ్బంది, రవీంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్
- జిల్లాకు 10 మంది ట్రెయినీ ఎస్ఐలు..



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాకు కేటాయించబడిన 10 మంది ట్రెయినీ ఎస్ఐలు.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిన ట్రైనీ ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరు పోలీసు డిపార్ట్మెంట్ అని.. అలాంటి శాఖలో నియమితులైన మీరందరూ క్రమ శిక్షణతో మెలగాలని, విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎవ్వరితో దురుసుగా మాట్లాడకూడదని, ఎదుటివారి సమస్యను ఓపి గ్గా విని, వారిలో ధైర్యాన్ని నింపి తక్షణ పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. సమాజ సేవ చేయడానికి పోలీసు శాఖ మరింత ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వ హిస్తూ, అన్నిరకాల డ్యూటీలను తెలుసుకోవాలన్నారు. డ్యూ టీల గురించి మనకు తెలిసినప్పుడే, సిబ్బందితో డ్యూటీ చేయించగలమని, ప్రతి డ్యూటీ గురించి తెలుసుకోవాల న్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపినా.. శాఖపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండి, ప్రజల ధన, మాన ప్రాణ రక్షణతో పాటు శాంతి భద్రతల రక్షణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవ రావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ. కళ్యాణి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ విజయ కృష్ణ, డిసిఆర్బి ఇన్‌స్పెక్టర్ రమేష్, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆర్.ఐ.లు ట్రైనీ ఎస్ఐల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో 'స్వచ్ఛ భారత్' చేపట్టండి



నవతెలంగాణ-పటాన్‌చెరు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని జాతీయ సేవాపథకం (ఎన్ఎంఎస్) వాలంటీర్లు శాస్త్రీయ దృక్పథంతో చేపట్టి, నిబద్ధతతో చురుకుగా పాల్గొనాలని ఐదు నంది అవార్డుల గ్రహీత, ప్రముఖ డబ్బింగ్ కళాకారుడు ఆర్ సి ఎం. రాజు పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని జాతీయ సేవా పథకం మంగళవారం నిర్వహించిన 'ఎన్ఎస్ఎస్ దినోత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. తన కళాశాల రోజులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో తన అనుభవనాలను గుర్తు చేసుకున్నారు. వాలంటీర్లను సమాజంలో ప్రత్యేకమైన వ్యక్తులుగా ఎన్ఎస్ఎస్ నిలబెడుతుందని చెబుతూ, సమాజ సేవ ప్రాముఖ్యతను వివరించారు. తాను డబ్బింగ్ చెప్పిన కల్కి, తంగళన్ వంటి పలు సినిమాల్లోని డైలాగ్‌లను చెప్పి విద్యార్థులను ఉత్సాహపరిచారు. పునర్వినియోగించ దగ్గ వస్తువులను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. 'శుభ్రత నాగరికతకు చిహ్నమంటూ, దానిని మనవంతా పాటిద్దామనే ప్రతినబూనాలని రాజు ఉద్బోధిం చారు. గీతం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్ర కుమార్ అధికారికంగా వేడుకలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగా, అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు మాట్లాడుతూ.. ఇతర విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండేలా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మసలుకోవాలని, సశీలత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణం, నిస్వార్థతలు తమ పని విధానంలో ప్రతిబింబించాలని సూచించారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితులు ఏ సమయం అనేది చూడకుండా సమాజ సేవలో ఎల్లవేళలా గీతం ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు ముందుంటారంటూ సాధారణ ఎన్నికల్లో వెబ్‌కాస్టింగ్ వంటి కొన్ని సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. ఎన్ఎస్ఎస్ గీతాలాపనతో అరంభమైన కార్యక్రమం కార్యక్రమ సమన్వయకర్త భార్గవి వందన సమర్పణతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ముగిసింది. వాలంటీర్లలో సేవా స్ఫూర్తిని వారి వ్యక్తిగత ఎదుగుదలను పెంపొందిస్తూ ఈ వేడుక విజయవంతమైంది.

గతంలో అనుమతులు.. నేడు వద్దంటూ వినతులు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని నల్లవల్లి పంచాయతీ ప్యారానగర్ పరిసరాల ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనుమతులు ఇప్పించిన కొందరు నాయకులు.. నేడు కాంగ్రెస్ పార్టీలో చేరి డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టొద్దు అంటూ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు ఇవ్వడం విడ్డూరంగా ఉన్నదంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు మాటాడుతూ.. గత ప్రభుత్వంలో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం పని చేసిన నాయకులే.. నేడు ప్రజల్లో ఉనికిని కాపాడుకోవడానికి డంపింగ్ యార్డు వద్దంటూ వినతిపత్రాలు అందజేయడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు బీఆర్ఎస్ హయాంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకపోయి నప్పటికీ.. గత పాలకులు తప్పుడు నివేదికలు సృష్టించుకున్న పత్రాలపై మండల మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు సంతకాలు చేసి నేడు తెలియనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పచ్చటి అటవీ, వ్యవసాయ ఆధారితమైన ఈ ప్రాంతాన్ని కాలుష్య కోరల్లో నెట్టేస్తున్నామని నాడు ఈ ప్రజాప్రతినిధులు తెల్సుకోలేకపోయారన్నారు. టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ.. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయొద్దని మంత్రి దామోదర రాజనర్సింహాకు గతంలోనే విజ్ఞప్తి చేసినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీలు గోవర్ధన్ గౌడ్, యువ నాయకులు మద్ది ప్రతాపరెడ్డి, ఎం నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మండలి తులసీ దాస్, విజయ్ కుమార్, రవి, బ్యాగరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



నవతెలంగాణ-జహీరాబాద్

స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని మంగళవానం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ హరికుమార్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు అత్యవసర సమయాల్లో దేశానికి సేవ చేస్తారన్నారు. అలాగే ప్రజలు పారిశుధ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని.. స్వచ్ఛ భారత్‌ను పాటించాలన్నారు. కాగా సాంస్కృతిక కార్యక్రమంలో అనేకమంది ఎన్ఎస్ఎస్ వాలెంటర్లు పాల్గొని దేశభక్తి గీతాలు పెయింటింగ్స్‌లో ప్రతిభ కనబరిచారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. తదనం తరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కే నందు గౌడ్, బి దత్తు, అధ్యాప కులు బి నర్సింలు, దీపిక, ఏం రమేష్, వాలెంటర్స్ పాల్గొన్నారు.

55 ఏండ్లు పైబడిన వీఆర్ఏలకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఝరాసంగం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవోలు 81, 85, 98 ద్వారా ప్రమోషన్స్ పొంది తక్కువ సర్వీస్ చేసి ఎలాంటి బెనిఫిట్స్ పొందకుండా రిటైర్మెంట్ అవుతూ రోడ్డున పడుతున్న 55-66 వయసు మధ్య గల వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని పూర్వ వీఆర్ఏల పోరాట సమితి సభ్యులు తహసిల్దార్ తిరుమల రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. వారి స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తూ తమకు న్యాయం చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పెంటయ్య, అంజయ్య నరసయ్య, భీమన్న, మానేన్న ఉన్నారు.

పలు పాఠశాలల్లో ఎంపీడీఓ తనిఖీలు



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్ద మండలంలోని మోర్గి, గోందేగావ్, షాపూర్ గ్రామాల్లోని పాఠశాలను ఎంపీడీఓ మహేష్ రావు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. విద్యార్థుల భోజనం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి.. చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్వచ్ఛతా పనులు పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో పాటు ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి, ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

- సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర సమావేశంలో

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పల్లె నుంచి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి కృషి చేస్తానని పటాన్ చెరు ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం ఏర్పాటుచేసిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాటాడుతూ.. దశాబ్దాల చరిత్ర కలిగిన రేషన్ డీలర్ల సంఘానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినా, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర అభినందనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీల అమలుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఐదు వేల రూపాయల గౌరవ వేతనం, క్వింటాలకు రూ.300 కమిషన్ అందించాలను కోరుతూ త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీలర్ల సంఘం అధ్యక్షులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హామీల అమలు అనంతరం రాష్ట్ర రాజధాని హైదరాబాదులో రెండు లక్షల మందితో విజయోత్సవ ర్యాలీ ఏర్పాటు చేస్తానన్నారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంతోపాటు.. ప్రతి రేషన్ డీలర్‌కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంభర్, వివిధ జిల్లాల నుండి వచ్చిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న నేపథ్యంలో కంది, పెసర పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త విజయకుమార్ తెలిపారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి, భూర్దిపాడు గ్రామాల్లో సాగు చేసిన కంది, పెసర పంటలను వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతితో కలిసి మంగళవారం పరిశీలించారు. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కంది చేనులో నీరు నిల్వ ఉండటం, కావాల్సిన దాని కంటే తేమశాతం భూమిలో ఎక్కువ రోజులు ఉండటం వల్ల ప్యుజేరియం, పైటోప్తోరా శిలింద్రముల ద్వారా ఎండుతెగులు వ్యాపిస్తుందన్నారు. తెగులు తీవ్రమైన దశలో గుంపులు గుంపులుగా మొక్కలు ఎండిపోతాయన్నారు. దీని నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్క మొదల్లో బాగా తడిచే లాగా నాజిల్ తీసి పిచికారి చేసుకోవాలన్నారు. భూమి ద్వారా వ్యాపించే ఆయా శిలీంద్రాలను అరికట్టడానికి విత్తుకొనేటప్పుడు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మతో విత్తన శుద్ధి చేయాలన్నారు. అలాగే విత్తిన మొదటి నెలలోపు ట్రైకోడెర్మను మాగిన పశువుల ఎరువులో కలుపుకొని ఎకరాకు 2కిలోల చొప్పున భూమిలో పదన ఉన్నపుడు పై పాటుగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, ఆత్మ బీటీఎం చరణ్, రెట్యతులు మహేశ్వర్,గురునాథ్,గోపాల్‌రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో యూటీఎఫ్ మెంబర్షిప్ క్యాంపెయిన్



నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని బుచ్చినెల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ మెంబర్షిప్ క్యాంపెయిన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర మరియు జిల్లా కమిటీ నాయకులు రమేష్ కుమార్, శ్యామ్, సిరజుద్దీన్‌లు మాట్లాడుతూ.. ఆరు మేనేజ్మెంట్లలో ఉన్న గురుకుల పాఠశాలల్లో ఇటీవల ఇచ్చిన సమయ సారిణి విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్నదన్నారు. వెంటనే ఆ పని వేళల్లో మార్పు చేయాలన్నారు. విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలని, ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ మరియు గురుకుల ఉపాధ్యా యుల జేఏసీ ఆధ్వర్యంలో 3 దశల పోరాట కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. మూడోదశ పోరాటంలో భాగంగా ఈనెల 28న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ మహాధర్నాను విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్యామ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్ టీఎస్ యూటీఎఫ్ మండల నాయకులు మక్సుద్ అహ్మద్, అమృత్, చందర్, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రుబీనా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి లోకల్ ఎలక్షన్‌లో ప్రాధాన్యత



నవతెలంగాణ-జిన్నారం

పార్టీ కోసం నిరంతరం శ్రమించే కాంగ్రెస్ శ్రేణులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్పూర్ 15 వార్డు కౌన్సిలర్ కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారని మండల సోషల్ మీడియా కాంగ్రెస్ ఇంచార్జ్ విష్ణుమూర్తి తెలిపారు. మంగళవారం నిర్వహించిన సంగారెడ్డి జిల్లాస్థాయి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సమీక్ష సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై వివిధ అంశాలను చర్చించినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని కష్టనష్టాల్లో ఆదుకుంటామని ప్రజల కోసం పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారన్నారు. సోషల్ మీడియా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ట్విట్టర్ కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ సెక్రెటరీ మొహమ్మద్ అబిద్ అలీ, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, జహీరాబాద్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వైస్ ఎంపీపీ షాకీర్,జడ్పిటిసి నరేష్ కుమార్, జిన్నారం మండల్ సోషల్ మీడియా ఇంచార్జ్ విష్ణుమూర్తి చారి, అమీన్పూర్ మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ అనిల్,నీరజ్ బృందం పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి భాధ్యత



నవతెలంగాణ-రాయికోడ్

మొక్కలు నాటి వాటిని కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని మండల స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వర్, ఎంపీడీవో షరీఫ్ అన్నారు. మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం స్వచ్ఛతా హే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాణకోటికి జీవాధారం అయిన మొక్కలను ప్రతి ఒక్కరు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, అంజలిదేవి, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్‌డ్రెస్ అందజేత



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్వెల్లి విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన సందర్భంగా స్ట్రాంగ్ ఫైటర్స్ క్లబ్ సభ్యులు ఆ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల నుంచి డిస్టిక్ లెవెల్ సెలక్షన్‌కు ఎంపికైన విద్యార్థులకు తమ ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుం దన్నారు. రాష్ట్రస్థాయికి కూడా ఎంపికై ఈ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువులను వదలొద్దు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్‌లో ప్రధాన రహదారులపై సంచరిస్తున్న పశువులను వచ్చే సోమవారం లోపు వెంటనే తరలించాలని.. లేనిపక్షంలో ఆ పశువులను గోశాలలకు తరలిస్తామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జె.జెగ్జీవన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పశువులు సంచరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి వెంటనే వాటిని తరలించాలన్నారు

ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేయాలి



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి పద్మ

నవ తెలంగాణ-మెదక్ టౌన్ : మెదక్ జిల్లా కేంద్రంలోని కేవలం కిషన్ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది పేదలు విష జ్వరాలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పేదలు ప్రభుత్వ హాస్పిటల్స్‌కు తండోపతండాలుగా వస్తున్నారని అన్నారు. హాస్పిటల్స్ లో చికిత్సకు వస్తున్న పేదలకు సరిపడా మందు లేక వైద్యులు లేక ప్రైవేటు హాస్పిటల్ కు వెళ్లలేక ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో రాష్ట్రం ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలోని హాస్పిటల్‌లో మందులు లేక వైద్యాధికారులు వ్యాధులకు చికిత్స అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ హాస్పిటల్స్ లో మందులు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చితే వ్యవసాయ కార్మిక సంఘం పేదల తరపున రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి దేవయ్య, కే మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, వెంకటి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ లచ్చ గౌడ్, నాయకులు గంగయ్య, యాదగిరి, రామవ్వ పాల్గొన్నారు.

26న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

- టీపీ ఏసి జాక్ చైర్మన్ బి స్వామి



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర కమిటీ టీపీ ఏసి జాక్ ఆధ్వర్యంలో ఈ నెల 26న టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండి ఆఫీస్ ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాలో జిల్లాలోని ఆర్టిజన్స్ అందరూ యూనియన్‌లకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని టీపీఏ సీఎం జాక్ చైర్మన్ బి.స్వామి కోరారు. ఆర్టిజన్స్ హక్కుల కోసం అందరం ఐక్యం కావాలన్నారు. ఆర్టిజన్లకు కన్వర్షన్ అయ్యేంతవరకు 26న జరిగే కార్యక్రమం నాటికి యాజమాన్యం, ప్రభుత్వం స్పందించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జేఎల్ఎం నోటిఫికేషన్ కూడా ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలలోనే బ్యాంకు ఖాతాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీజీవీబీ నిజాంపేట బ్యాంక్ మేనేజర్ మురళి కృష్ణ అకౌంటెంట్ స్వాతి బ్యాంకు మిత్ర రవి ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలను అందజేశారు. మెరుగైన బ్యాంక్ సేవలను అందించడానికి తమ బ్యాంకు ఎప్పుడు అందుబాటులో ఉంటుందని మేనేజర్ మురళికృష్ణ తెలిపారు. విద్యార్థుల దగ్గరికి వచ్చి బ్యాంకు ఖాతాలు ఇచ్చినందుకు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్, శ్రీమతి సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి పాల్గొన్నారు

పాపన్నపేట పాఠశాలలో స్వచ్ఛతపై పోటీలు



నవతెలంగాణ-పాపన్నపేట

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుండే వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛతపై అందరికీ అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఎంపీవో పరమేష్, గ్రామ కార్యదర్శి నయీమ్ ఉపాధ్యాయులు నాగరాజు, అంజా గౌడ్, యాదయ్య ఎంపీడీవో సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో "స్వచ్ఛత హి సేవ"



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో మంగళవారం ఎంపిడిఓ ఏ.ఆనంద్ ఆధ్వర్యంలో "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, హాస్టల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ సుజాత, పంచాయితీ కార్యదర్శి నాగభూషణం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బూరుగుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. హవేలి ఘనపూర్ ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం బూరుగుపల్లి గ్రామానికి చెందిన గుండమ్మోల భూమయ్య (70) కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న శ్రీపతి చెరువు వద్దకు వెళ్ళాడు. ఈ క్రమంలో కాలుజారి చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన గడప దేవేందర్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలానికి చెందిన మత్స్యశాఖ మెదక్ జిల్లా డైరెక్టర్ గడప దేవేందర్ మంగళవారం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడప దేవేందర్ మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను, మత్స్యకారుల బీమా పెండింగ్ విషయపై చర్చించి , మత్స్యకారులకు అండగా ఉండాలని మహేష్ కుమార్ గౌడ్‌ను కోరినట్లు తెలిపారు.

ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేసిన ఏవో బాల్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

హవేలీ ఘనపూర్ మండలం లోని ఫరీద్‌పూర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాపును మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానా కాలంలో ఫర్టిలైజర్ శాంపిల్స్‌ని సేకరించి ల్యాబ్‌కి పంపించినట్లు తెలిపారు. ఎరువుల నాణ్యతను పరీక్షించేందుకు శాంపిల్ సేకరించినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందజేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్, భార్గవ్, ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు వికాస్ రెడ్డి, శేఖర్ మాజీ సర్పంచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో డ్రైనేజ్ సమస్య పరిష్కారం



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలోని 16వ వార్డులో ఆశాజ్యోతి డయాగ్నొస్టిక్ సెంటర్ దగ్గర్లో అండర్ పాస్ డ్రైనేజీ పైప్ లైన్ డ్యామేజ్ కావడంతో మంగళవారం మున్సిపల్ సిబ్బంది మరమ్మత్తు పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది మరమ్మత్తు పనులు చేపట్టారు. మరమ్మత్తు పనులను 16వ వార్డు కౌన్సిలర్ కొడిప్యాక నారాయణ గుప్తా పరిశీలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-పాపన్నపేట

బీఆర్ఎస్ కార్యకర్త వడ్ల అశోక్ కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంటారెడ్డి తిరుపతిరెడ్డి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని తమ్మయిపల్లి గ్రామానికి చెందిన వడ్ల అశోక్ తల్లి సంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కంటారెడ్డి తిరుపతిరెడ్డి స్థానిక నాయకుడు అనిల్ రెడ్డి ద్వారా ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు, వీరి వెంట స్థానిక నాయకులు సుభాష్ రెడ్డి, మొగులమ్మ సాయిలు, మంజుల, శ్రీశైలం తదితరులున్నారు.

వినాయకుని లడ్డు దక్కించుకున్న ముస్లిం సోదరుడు



నవతెలంగాణ-కౌడిపల్లి

17 రోజులపాటు వివిధ రకాలుగా పూజలు అందుకున్న వినాయకుని లడ్డూ వేలంలో ముస్లిం సోదరుడు మక్బుల్ రూ.36,666 వేలకు దక్కించుకోవడం విశేషంగా మారింది. సోమవారం మార్కెట్ వద్ద వినాయకుని లడ్డు వేలంలో హెూరాహెూరీగా పోటీ పడగా శీనన్న యువసేన సభ్యులు దక్కించుకున్నారు. ముస్లిం సోదరుడు లడ్డు వేలంలో పాల్గొని వినాయకుని లడ్డు కైవసం చేసుకోవడం జరిగింది. ఎంతో పవిత్రత గల వినాయకుని లడ్డు కోసం చాలామంది పోటీ పడగా, ముస్లిం సోదరుడికి కైవసం కావడం సంతోషించదగ్గ విషయమని అభినందించారు. అనంతరం గ్రంథాలయం వద్ద వెంకటేష్ గుప్తా గణేష్ లడ్డు వేలంలో దక్కించుకున్నాడు.

ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ జిల్లా కలెక్టర్ అధికారులు



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

రాష్ట్రంలో ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చీఫ్ ఎలెక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం, హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో స్పెషల్ సమ్మరీ రివిజన్ ఈఆర్‌ఓ నెట్ 2.0 పై ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మెదక్ జిల్లా నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ గత వారం రోజులుగా నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతంపైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, సెప్టెంబర్ 28 నాటికి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న ఓటర్ల నమోదుకు సంబంధించి ఫార్మ్ 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదన్నారు. ఇంటింటి సర్వేకు సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29లోపు పూర్తి చేయాలని సీఈఓ అధికారులను ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లు దగ్గరలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సంబంధిత ఎన్నికల ఏఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఓటరుకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులతో సమావేశమై ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పుల గురించి ఓటర్లకు వివరించాలన్నారు. మరణించిన ఓటర్లను తొలగించడం, ఫొటో గుర్తింపు కార్డుకు సంబంధించి సరిగాలేని ఫొటోలను సేకరించాలన్నారు. ఇంటి నంబర్, ఇతర సవరణ కోసం ఫార్మ్-8 ద్వారా ఓటర్ల నుంచి తీసుకోవాలన్నారు. అదే విధంగా 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజలు, విద్యార్థివిద్యార్థినిలు, యువకులు, మహిళా సంఘాలు, ఎన్జీవోలు, పూర్తిస్థాయిలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రమాదేవి, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్‌లు, ఎన్నికల సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

చిన్న సమస్యను పెద్దది చేస్తున్న హరీష్ రావు

- సునీత రెడ్డి ఇంటిపై జరిగిన దాడి చిన్న సంఘటన
- నర్సాపూర్‌లో పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటారు
- కాంగ్రెస్ వాళ్లను గుండాలుగా చిత్రీకరించడం సరికాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు



నవతెలంగాణ-నర్సాపూర్

ఎమ్మెల్యే సునీత లక్ష్మరెడ్డి ఇంటిపై జరిగిన దాడి చిన్న సంఘటన అని, ఇలాంటి చిన్న సమస్యకు హరీష్ రావు రావడం అవసరమా అని కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హన్మంత్ రావు అన్నారు. మంగళవారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వాళ్ళను నిలదీస్తే కాంగ్రెస్ వాళ్ళను గుండాలుగా చిత్రీకరిస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ కార్యకర్తలపైన బీఆర్ఎస్ దాడి చేయలేదా అని ప్రశ్నించారు. మేము ఎప్పుడు ప్రజల కోసం ఆలోస్తామని, ఈ 5 సంవత్సరాల్లో ప్రజలను ఓట్లు అడగకుండా ప్రజలే కాంగ్రెస్‌కి ఓటు వేసే విధంగా పని చేస్తామన్నారు. హైదరాబాదును ధ్వంసం చేసిందే బీఆర్ఎస్ పార్టీ అని, నేడు అడ్రస్ లేని వాళ్ళు తెలంగాణ సాధించామని చెప్పుకుంటున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ వాళ్ళు ఉద్యమ కారులను వాడుకొని పాలన సాగించారన్నారు. హరీష్‌రావు, కేటీఆర్ గతంలో లక్షల కోట్ల కుంభకోణం చేశారన్నారు. నర్సాపూర్ నుంచి మదన్ రెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేస్తే గెలిచే వారు అని, మదన్ రెడ్డి లాంటి వాళ్లను ఎంతోమంది సీనియర్ లీడర్లను రాజకీయంగా అణగదొక్కిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఇక బావా, బామ్మర్దులను టార్గెట్ చేయాల్సిందిగా కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు నిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నర్సాపూర్, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నాయకులు మల్లేశం, వెంకటరామిరెడ్డి, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్న గ్యాస్ డీలర్

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల డిమాండ్



నవతెలంగాణ-వెల్దుర్తి

ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులకు అందజేయాల్సిన గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్లలోకి పొదల చాటున రీఫిలింగ్ చేస్తుండగా పట్టుబడిన సిబ్బందిపై, గ్యాస్ ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల పరిధి దామరంచ గ్రామానికి చెందిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులు మంగళవారం డిమాండ్ చేశారు. ప్రజలకు సరఫరా చేయాల్సిన గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ దోపిడీ చేస్తున్న వ్యక్తులను దామరంచ గ్రామస్తులు పట్టుకొని నిలదీశారు. వెల్దుర్తి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి దామరంచ గ్రామంలో సరఫరా చేయడం కోసం సిలిండర్లను తీసుకు వస్తున్న సిబ్బంది గ్రామ శివారులో నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్లోనికి కిలో నుంచి రెండు మూడు కిలోల వరకు రి ఫీలింగ్ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గతంలో కూడా ఇదే విధంగామ రి ఫీలింగ్ చేస్తుండగా పట్టుకొని దేహశుద్ధి చేసినా తీరు మారలేదన్నారు. సంబంధిత సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసినా అమ్యామ్యాలకు అలవాటు పడి నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే మళ్లీ మళ్లీ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా వెల్దుర్తి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

చెరువుల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ల పరిశీలన

- ఆర్డీవో జయచంద్రారెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న మండలంలోని 138 చెరువులకుగాను 93 చెరువుల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ పరిధులను ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు సూచనల మేరకు ప్రత్యేక చొరవ తీసుకొంటూ సర్వే పనులలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు సూచనలు ఇస్తూ ఎప్పటికప్పుడు సర్వే పనులను సమీక్షిస్తున్నామని తెలిపారు. తుది నోటిఫికేషన్ కోసం హెచ్ఎండిఏ జారీచేసిన చెరువు మ్యాప్‌ల ఆధారంగా రెవెన్యు, ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధులను స్పష్టంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలములో 23, మనోహరబాద్ మండలంలో 22 చెరువుల తుది నోటిఫికేషన్ సర్వే పనులు పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన చెరువుల సర్వే కూడ త్వరలో పూర్తి చేస్తామన్నారు.

గోల్డ్ మెడల్ విజేతలకు అభినందనలు

- సాఫ్ట్ బాల్‌లో మెదక్ జిల్లా జట్టుకు బంగారు పతకం



నవతెలంగాణ-తూప్రాన్

సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 23వ తేది వరకు జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు బంగారు పతకం సాధించిందని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొడిప్యాక నారాయణ గుప్త తెలిపారు. మెదక్ జిల్లా బాలుర జట్టు చాంపియన్ షిప్ పోటీల్లో తొలి నుండి ఆధిపత్యం వహించి ఫైనల్లో నిజామాబాద్ జట్టుతో హెూరాహెూరీగా తలపడి 5-3 స్కోర్‌తో విజయం సాధించి బంగారు పతకాన్ని సాధించారని తెలిపారు. జిల్లా జట్టులో అరవింద్ అద్భుతంగా రాణించారన్నారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అరవింద్‌తో పాటు జట్టు విజయానికి కీలక పాత్ర పోషించిన కోచ్ సుమన్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, గీతా స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ రామాంజనేయులు, గీతా స్కూల్ ప్రిన్సిపల్ గీతాకృష్ణ, క్రీడాకారులు, పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే మంచి ఆరోగ్యం

- తెలంగాణ మిల్లెట్ మ్యాన్ వీర్ శెట్టి
- పాల్వంచలో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ -టేక్మాల్

రైతులు చిరుధాన్యాలు పండించుకొని వాటిని ఆహారంగా తీసుకుంటే మంచి ఆరోగ్యంతో జీవించవచ్చుని మిల్లెట్ మ్యాన్ వీర్ శెట్టి సూచించారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని పాల్వంచ దత్తాత్రేయ దేవాలయంలో మండల రైతు సంఘం సీఈవో వెంకటేశం అధ్యక్షతన చిరుధాన్యాల సాగు విధానం, దిగుబడి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పాల్వంచలో రైతులు సుభాష్, చాకలి సాయిలు సాగుచేసిన కొర్ర పంటలను మిషన్లతో పట్టి వాటిని బియ్యంగా తయారు చేశారు. అనంతరం వాటితో తినుబండారులను తయారుచేసి అందరికీ రుచి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే అన్నాన్ని పూర్తిగా తగ్గించి చిరుధాన్యాల ఆహార పదార్థాలను తీసుకోవాల న్నారు. వాణిజ్య పంటలను తగ్గించి సమయానుకూలాన్ని బట్టి కొర్రలు, రాగులు, సజ్జలు వంటి పంటలను పండించి దిగుబడి పొందాలని సూచించారు. రైతులకు చిరుధాన్యాలు పండిస్తే ఉచితంగా విత్తన పంపిణీ చేస్తామని చెప్పారు. ఇందులో సంఘం చైర్మన్ మొగులయ్య, ఐఐఎంఆర్ ప్రతినిధి రాం కిషోర్, పెద్దలు వీరప్ప, మధుసూదన్ రెడ్డి, హనుమంతు, దుర్గారెడ్డి, రాములు, సంగమేశ్వర్ రెడ్డి , సంఘం డైరెక్టర్లు బీరప్ప, పెంటయ్య, దత్తు, నర్సింలు, లక్ష్మీనారాయణ సుభాష్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్జిటిలకు అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-తుప్రాన్

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో కిష్టాపూర్, ఇస్లాంపూర్, నాగులపల్లి, గుండ్రెడ్డిపల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జిటిలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎంల పోస్టులు మంజూరు చేసి, వాటిని భర్తీ చేయాలని కోరారు. పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను, జీపిఎఫ్ బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చక్రవర్తి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాను ప్రసాద్ గౌడ్, సంతోష్, సంజీవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలను సందర్శించిన ఏరువాక శాస్త్రవేత్తలు

- చీడపురుగుల నివారణ చర్యలు చేపట్టాలి
- ఏవో రాజశేఖర్



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండలంలోని చండూర్, చిట్కుల్ గ్రామాలలో రాజేంద్రనగర్ వరి పరిశోధన కేంద్రం, , ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం వరిపంటలను పరిశీలించారు. చండూరు గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్ రెడ్డి చిరు సంచి వరి పరిశోధన కేంద్రం దశలో ఉన్న కేఎస్ఎమ్ 12382, కెపిఎస్ 10361 రకానికి చెందిన వరి పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ వర్మ, డాక్టర్ కిరణ్, డాక్టర్ సరితలు సందర్శించి పరిశీలించారు. సెప్టెంబర్ నెలలో కురిసిన అధిక వర్షాలకు వరిలో చీడ పీడలను, కాండం తొలుచు పురుగు, ఆకుముడుతలను గమనించారు. వీటి నివారణకుగాను రైతులు కోరాజిన్ 60 ఎంఎల్, కిల్ డాన్ 400 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజశేఖర్ గౌడ్, రైతులు చంద్రశేఖర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఏఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ రింగ్ రోడ్డుకు 436.20 ఎకరాల భూసేకరణ

- ఆర్డీవో జయచంద్రారెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలో రీజనల్ రింగ్ రోడ్డుకు 436.20 ఎకరాల భూ సేకరణ చేయుటకు గెజిట్ విడుదలైనట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరానికి ఉత్తర భాగమున సుమారు 158 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయుటకు సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు గల రహదారిలో తూప్రాన్ డివిజన్ పరిధిలో భూ సేకరణకు ఆదేశాలు వచ్చాయన్నారు. తూప్రాన్ మండలంలోని వట్టూర్ 32.37 ఎకరాలు, నాగులపల్లి 116.20 ఎకరాలు, ఇస్లాంపూర్ 100 ఎకరాలు, దాతర్ పల్లి 1.30 ఎకరాలు, గుండ్రెడ్డిపల్లి 57.30 ఎకరాలు, కిష్టాపూర్ 0.13 ఎకరాలు, వెంకటాయపల్లి 42.30 ఎకరాలు, నర్సంపల్లి 73.28 ఎకరాల భూమి గ్రామాల పరిధిలోగల హెక్టార్ల 1376 నుంచి 616 (436.20) ఎకరాల భూ సేకరణకై గతంలో కేంద్ర ప్రభుత్వం 3.ఏ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా నే సుమారుగా తూప్రాన్ మండల వ్యాప్తంగా 133.42 హెక్టార్లు అనగా 329.54 ఎకరాల భూమికి 3 డి తేది 8 ఆగస్టు, 2023 న నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీని ప్రకారం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా సంప్రదింపులు జరిపి మార్కెట్ విలువ ప్రకారం పరిహారాన్ని నిర్ధారణ చేసిన తర్వాత రైతులకు నష్టపరిహార చెల్లింపులు చేస్తామన్నారు. ఆ తర్వాత 38.04 హెక్టార్లు అనగా 93.95 ఎకరాలు అదే రేటు ప్రకారము చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ ప్రక్రియకు 2 నెలల సమయం పడుతుందన్నారు. మిగిలిన 6.716 హెక్టార్లు అనగా 16.58 ఎకరాలలో 3.8 సార్లు అనగా 9.38 ఎకరాల భూమికి అదనపు 3.ఎ ప్రకటన గురించి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా పిడిఐ గజ్వేల్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మిగిలిన భూమి 2.9 హెక్టార్లు అనగా 7.163 ఎకరాలు ఏజెన్సీ ద్వారా సర్వే చేసిన తర్వాత భూసేకరణ చేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి


- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

రోడ్డు భద్రత నియమాలు పాటించి, ప్రమాదాలు నివారించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సంబంధిత ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, మున్సిపాలిటీ, టౌన్ ప్లానింగ్, పోలీస్, రవాణా సంబంధిత శాఖలతో.జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వెహికిల్స్ మూలంగా పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం, ఫోర్ వీలర్స్‌కు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరన్నారు. సంబంధిత అధికారులు ప్రమాద నివారణ చర్యలను వెంటనే చేపట్టాలని కలక్టర్ సూచించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాద హెచ్చరికలను వాహనదారులకు కనబడే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణ వైద్యం కోసం 108 సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం జరిగిన ప్రమాదాలు భేరీజు వేసుకొని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలను చర్చించి సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేస్తుందని ప్రమాదాలపై వాహనదారులకు తగు సూచనలు చేస్తూ వాహన తనిఖీలు నిర్వహించి జరిమానాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సర్దార్ సింగ్, నేషనల్ హైవే పిడి మాధవి, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి హేయనీయం



నవతెలంగాణ కొల్చారం

నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి హేయనీయమైన చర్య అని మాజీ ఆత్మకమిటి డైరెక్టర్ తుక్కాపూర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయటం అత్యంత హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులతో సునీతా లక్ష్మారెడ్డి వంటి బలమైన నాయకుల మనోధైర్యాన్ని దెబ్బతీయలరన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
బుధవారం | 25 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

పెద్దగుండవెల్లిలో ఫీవర్ క్యాంప్



- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- అనారోగ్యానికి గురైతే ప్రభుత్వస్పత్రికి వెళ్లాలని సూచన
- తిమ్మాపూర్ హెచ్ఈవో రాజేందర్

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

వర్షకాలంలో డెంగ్యూ, విష జ్వరాలు ప్రభలే అవకాశాలు ఎక్కువని వాటి బారీన పడి ప్రజలు అనారోగ్యానికి గురి కావద్దని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిమ్మాపూర్ హెచ్ఈవో రాజేందర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దగుండవెల్లి గ్రామంలోని వడ్డెర కాలనీలో తిమ్మాపూర్ పీహెచ్సి ఆధ్వర్యంలో ఫీవర్ క్యాంప్ నిర్వహించి అనారోగ్యంగా ఉన్న వృద్దులకు, మహిళలకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు దరి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకువాలని సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆరు బయట నీరు నిల్వకుండా చూడాలని పేర్కొన్నారు. వర్షాలు లేదా గత కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారిని ఆశవర్కర్లు గుర్తించి ఏఎన్ఎంలకు గానీ సమీప పీహెచ్సికి రోగులు వెళ్లేలా ఆశవర్కర్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ యాదగిరి, సిబ్బంది గణేష్, శోభ,యాదగిరి, రమ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు కాలనీ వసూలున్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి



- ఇంటర్ బోర్డు విద్యాధికారి రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన అవసరం అధ్యాపకులపై ఉందని ఇంటర్ బోర్డు విద్యాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో స్థానిక ఎడ్యుకేషన్ హబ్.లో జూనియర్ కళాశాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాశాలలకు తలమానికంగా ఉన్న ఎడ్యుకేషన్ హబ్.లో అడ్మిషన్లు ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలని ఆయన కోరారు. పేద బడుగుల బలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ కళాశాలలో చదివేల చూడాలని ఆయన చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలలో చేర్చి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆ విధంగా అధ్యాపకులు పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మంచి భవిష్యత్తు తీర్చుకునే సమయం ఇదేనని ఆయన పేర్కొన్నారు. చక్కగా చదువుకొని ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చల చదువుకోవాలన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు వెంకటరమణ, ప్రకాష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

స్థంభాలకు ఉన్న పిచ్చిమొక్కల తొలగింపు



నవతెలంగాణ-మర్కుక్ : అధికారుల నిర్లక్ష్యం.. అల్లుకున్న తీగలు అనే శీర్షికతో 'నవతెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి మర్కుక్ విద్యుత్ ఏఈ స్పందించారు. తన సిబ్బందితో కలసి ఎర్రవల్లి సామూహిక ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న విద్యుత్ స్తంబాలకు అల్లుకున్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు.

రియల్ మాయాజాలం



- కొన్నవారికి సౌకర్యాలు ఏవి..?
- వెంచర్ మ్యాపులో అన్ని చూపుతారు


నవతెలంగాణ-గజ్వేల్

అధికారులకు చేతులు తడిపి ఆగమేఘాల మీద వెంచర్లు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేతులు దులుపేసుకుంటున్నారు. వెంచర్లలో అండర్ డ్రైనేజీ, దేవాలయాలు, పార్కులు, పార్కింగ్, స్విమ్మింగ్ పూల్, ఆట స్థలాలు, ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని వెంచర్ మ్యాప్లో చూపుతారు. దాంతో ఆకర్షణకు గురై కొనుగోలు చేసిన వ్యక్తులు మోసపోతున్నారు. విక్రయించిన వారు దరిదాపులో కనిపించరు. చేతులు మారుతూ ప్లాట్లు విక్రయిస్తారు. మధ్యవర్తి సైతం వెంచర్ల ఉన్నయే విషయాలనే చెప్పి ప్లాట్ విక్రయించుకొని డబ్బులు చేతిలో పడ్డ తర్వాత కనిపించకుండా పోతున్నారు. సమాచారం కోసం ఇచ్చిన ఫోన్లు సైతం మార్చేస్తున్నారు. ఈ దుస్థితి సిద్దిపేట జిల్లాలో ప్రధాన పట్టణాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాయాజాలం సృష్టిస్తూ కాసుల దులుపేసుకుంటున్నారు. ప్రయివేటు, ప్రభుత్వ, వ్యాపారులలో స్థిరపడ్డ వ్యక్తులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు ఉంటే అందులో ఎలాంటి సౌకర్యాలు రియల్ ఎస్టేట్ వ్యాపారి చూపిన మ్యాప్లో స్థలాలు ఉండవు. కొన్ని సొసైటీ ద్వారా ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో కూడా మోసం తప్ప మరొకటి ఉండదు. ప్రభుత్వం ఇటీవల భూమి క్రమబద్ధీరణ పథకానికి (ఎల్ఆర్ ఎస్) పచ్చజెండా ఊపిన నేపథ్యంలో కొనుగోలు చేసే వ్యక్తులు అన్నింటికీ బాధ్యులు ఎవరనేది భరోసా తీసుకొని కొనుగోలు చేయాలి. స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతున్న సమయంలో కాసులు దులుపేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే కొందరు వ్యాపారులు వెంచర్లు వేశారు. జిల్లా కేంద్రం సిద్దిపేటతోపాటు, గజ్వేల్- ప్రజ్ఞాపూర్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీల్లో అనుమతి లేకుండా వేల సంఖ్యల్లో ఏర్పాటు చేశారు. అలాగే అమాయకులు కొని నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకపోవడంతో బ్యాంకు రుణాలు దొరకడం లేదు. సిద్దిపేట జిల్లాలో ఎల్ఆర్ఎస్ కు 76వేలు దరఖాస్తులు చేసుకున్నారు. వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు మున్సిపల్ శాఖ పనిచేస్తున్న సంబంధిత శాఖ అధికారులు నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనల మేరకు 10 శాతం భూమిని మున్సిపల్ కు అప్పగించాలి. ఉద్యానం, ఆటస్థలం,వెడల్పు రోడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పలువురు కొనుగోలువారులు. రియల్టర్లు దరఖాస్తు చేశారు. జిల్లాలో 70 వేల మంది ఎల్ఆర్ఎస్ కు అర్జీలు పెట్టుకున్నారు. కొన్ని వెంచర్లలో ఆట పరికరాలు ఉన్నా పర్యవేక్షు లేక అవి విరిగి, పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఎక్కువగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన నిర్వాహకులు ఇష్టారాజ్యంగా హద్దులు నిర్ధారించుకొని, ప్లాట్లుగా మార్చి విక్రయం చేశారు. చేతులు మారుతున్నాయి. ఒక్క ప్లాటు నలుగు చేతుల మీదుగా విక్రయాలు జరుగుతున్నాయి. వాటిలో కనీస నిబంధనలు పాటించలేదు.

సిద్దిపేట జిల్లాలో..

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అనేక వెంచర్ల మూడు నాలుగు వెంచర్లు కొంత సౌకర్యాల కోసం స్థలాలు చూపుతున్నారు. గజ్వేల్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆటస్థలం వదిలిపెట్టారు. మిగతా వెంచర్లు అవేవీ కనిపించకుండానే అనుమతులు పొంది విక్రయించుకుంటున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు చూసి చూడనట్టు పోతున్నారని విమర్శలున్నాయి. అనధికారికంగా అనేక వెంచర్లు ఏర్పాటు చేసి అమాయకులకు ప్లాట్లు విక్రయించి కాసులు దులుపేసుకుంటున్నారు. దుబ్బాక, చేర్యాల మున్సిపల్ పరిధిలో 60 పైగా వెంచర్లు ఏర్పాటు చేసి అందులో ఏ వెంచర్ కూడా పూర్తి అనుమతులు తీసుకోలేకపోయారు. కానీ 95శాతం ప్లాట్లు విక్రయించుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో 24 వెంచర్లు అనుమతి ఉన్నట్లు అధికారులు చెబుతున్న అనాధికారికంగా 70 పైగానే ఉన్నట్లు సమాచారం. ఇందులో ఉద్యానవనాలు, ఆట స్థలాలు, కొంతవరకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ భవనాలు నిర్మించనాటికి రియల్ వ్యాపారి వాటిని కూడా విక్రయించుకుని జేబులు నింపేసుకుంటున్నారు. గజ్వేల్,హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలో రియల్ వ్యాపారులు క్రమబద్ధీకరణ కాకుండా ప్లాట్లు పూర్తిస్థాయిలో విక్రయించుకుంటున్నారు. చాలా చోట్ల ప్లాట్ల హద్దులు తొలగించారు. తిరిగి ప్లాట్లు యజమానులు హద్దులు పాతుకుంటున్నారు. జిల్లాలో హుస్నాబాద్ సుమారు 20 వరకు వెంచర్లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో చాలా చోట్ల పేదల ప్లాట్లు కొని ఇబ్బందులకు గురవుతున్నారు. ఇండ్లు కట్టుకుందామని మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే 150 గజాల ప్లాటుకు రోడ్డు వైపు స్థలాన్ని పెద్ద ఎత్తున వదలాలని అధికారులు చెప్తున్నారు. రియల్ వ్యాపారులు వెంచర్ చేసినప్పుడు వదిలిన రోడ్డు స్థలం కాకుండా మున్సిపల్ చట్టం ప్రకారం భవనానికి ముందు స్థలము ఉండాలని ఆదేశాలిస్తున్నారు. కొన్నిచోట్ల యదా విధంగా నిర్మాణాలు జరిపిన తర్వాత అనుమతులు పొందుతున్నారు. కొన్నిచోట్ల కఠినంగా, మరికొన్ని చోట్ల సున్నితంగా చర్యలు ఉంటున్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫ్లాట్ యజమాని కొనుగోలు చేసే ముందు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు చెప్పుతున్నారు.

వరి పొలంను పరిశీలించిన ఏవో




- తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఏవో రామకృష్ణ

నవతెలంగాణ-మద్దూరు

రైతులు వరి పంటలో తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మద్దూరు ఏవో రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా మండలంలోని ధర్మారం శివారు లక్కపల్లి గ్రామంలో బొల్లం డేనియల్ వరి పొలం పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించినప్పుడు ఆకుల పైన పసుపు రంగు నీటి మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి వ్యాప్తి చెందుతాయి అని ఆయన తెలిపారు. ఎడతెరిపి లేకుండా గాళ్ళతో కూడిన వర్షాలు పడడం వలన ఈ బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తాయి అని ఆయన తెలిపారు. తెగులు నివారించడానికి కాపర్ ఆక్సి క్లోరైడ్ 2.0 గ్రాములు ప్లాంటమైసిన్ 0.4 గ్రాములు మిశ్రమాన్ని ఒక లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



- సీడీపీఓ సరిత

నవతెలంగాణ-మర్కుక్

చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే తల్లులు , పిల్లలు పుష్టిగా ఉంటారని సీడీపీఓ సరిత సూచించారు. మంగళవారం పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా పాములపర్తి ప్రాథమిక పాఠశాలలో గర్భిణిలకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పప్పు దినుసులు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల షుగర్ వ్యాధి, బీపీ లాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఆరు బయట ఆహారాన్ని మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అఫ్జల్, ,వైద్యాధికారి దీప, అంగన్వాడీ సూపర్ వైజర్లు డెబోర రాణి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖదీర్, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ పి.కిరణ్, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి నరేందర్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు సంతోష, సుజాత, జైబూనిసా, పాఠశాల విద్యార్థులు ,తదితరులున్నారు

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని దూల్మిట్ట, బెక్కల్, బైరాన్ పల్లి, గ్రామాల్లో నేడు ఉదయం 10:00 నుంచి ఒకటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ఏఈ శ్రీనివాసరావు, మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూల్మిట్ట 33 కెవి లైన్ పోల్స్ వేయుట. సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ఆయన తెలిపారు.విద్యుత్ అంతరాయానికి రైతులు గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఐటీఐలో ప్రవేశాల గడువు పొడిగింపు

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 28 వరకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ జీ.కనకయ్య మంగళవారం తెలిపారు. ఫిట్టర్ ట్రేడ్లో8, ఎలక్ట్రీషన్ ట్రేడ్లో-1 మిగిలి ఉన్న సీట్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దుబ్బాకలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

తెలంగాణ ఉద్యమ నేతకు సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా కేంద్రంలోని పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్జీవో భవన్)లో సిద్దిపేట జిల్లా ఉద్యమకారుల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ సూర్యుడు, ఉద్యమ సేనాని, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్, రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా పనిచేసిన ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి రావడం సంతోషకారం అని నిర్వాహకులు అన్నారు. నూతన ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం పొందిన కోదండరాంను ఈ నెల 26న సాయంత్రం ఐదు గంటలకు ఎన్జీవో భవన్లో సిద్దిపేట జిల్లా ఉద్యమకారులచే ఆత్మీయ సభను నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు. ఈ సమావేశానికి సిద్దిపేట జిల్లా ఉద్యమకారులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు, కళాకారులు, విద్యార్థి, నిరుద్యోగులు, సబ్బండ వర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు పెద్దిరాజు, విక్రం రెడ్డి, అందే ప్రవీణ్, కొండి మల్లారెడ్డి, కనక చంద్రం, శ్రద్ధానందం, చంద్రబాను, మధుసూదన్ రెడ్డి, రాజు, కీసర స్వామి, శ్రీహరి, నగేష్, ఉండ్రాల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

పటాన్చెరుకు బయలుదేరిన డీలర్లు



నవతెలంగాణ-మర్కుక్

తమ న్యాయ్యమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పటాన్ చెరులో చేపట్టిన సమావేశానికి మర్కుక్ మండలానికి చెందిన రేషన్ డీలర్లు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షులు గడీల కవిత బాల్ నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వం డీలర్లకు చాలీచాలని కమీషన్లు ఇస్తుండడంతో కుటుంబం నడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పుల పాలవుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు కమీషన్ను క్వింటాలుకు రూ.300 పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశానికి వెళ్లిన వారిలో గౌరవ అధ్యక్షులు మొర్సు పద్మా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవులు, రజిని వైకుంఠం, చంద్రకళ, చంద్రయ్య, శశి, సంతోష్, కృష్ణ రెడ్డి, వెంకటేశం, మమత, ముత్యం రెడ్డి, నవీన్,జయలక్ష్మి, తదితరులున్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తత అవసరం



- గజ్వేల్ సీఐ సైదా

నవతెలంగాణ-గజ్వేల్: విద్యార్థినులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు, మంగళవారం గజ్వేల్ ప్రభుత్వ మైనా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 విభాగం వారు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థినిలు అభద్రత భావంలో ఉండకూడదని ఆయన సూచించారు. విద్యార్థులలో భద్రత గురించి షీ టీం భరోసా టీం పనిచేస్తుందన్నారు. మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపుల గురించి సమాచారం వెంటనే ఇవ్వాలని ఆయన సూచించారు. సమాజంలో సోషల్ మీడియా యాప్స్ అమ్మాయిలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ కు బానిసలు కావద్దని కొందరు ఆకతాయిలు బ్లాక్మెయిల్ చేసి డ్రగ్స్ కు అలవాటు చేస్తున్నారన్నారు. ఆకతాయిలు బ్లాక్మెయిల్ ను అరికడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియన్స్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్లో అవినీతి, అక్రమ వసూళ్లు

- అవినీతికి పాల్పడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలి
- సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట బీఎస్పీ నాయకుల ధర్నా





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అవినీతి, అక్రమ వసూళ్ల దందాలతో పేద మధ్యతరగతి ప్రజలను దోపిడీ గురవుతున్నారని, అవినీతికి పాల్పడుతున్న సబ్ రిజిస్టర్ అధికారులను విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట బీఎస్పీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పశ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఇష్ట రాజ్యాంగ అక్రమ లేఔట్లు, అసైన్డ్ ప్రభుత్వ భూముల పట్టాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి నెంబర్ తో ఎక్కడో ఉన్న సర్వే నంబర్ భూములు రిజిస్ట్రేషన్ చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారన్నారు. మార్ట్ గేజ్ సర్టిఫికెట్లకు, మ్యారేజ్ సర్టిఫికెట్లకు, వ్యక్తిగత ప్లాట్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లకు ముడుపులు ఇవ్వనిది సిబ్బ ంది అధికారులు పనిచేయని పరిస్థితి నెలకొందన్నారు. అక్రమ వసూళ్లపై అధికారులు పద్ధతి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగందుల శంకర్, నియోజకవర్గం కన్వినర్ వేల్పుల రాజు, సీనియర్ నాయకులు సుధాకర్, మండలం అధ్యక్షులు దుంద్ర రాంబాబు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు

సర్దుబాటుతో అధిక అగాధం



- ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ విద్యా వ్యవస్థ ముఖ్యంగా ప్రాథమిక విద్యావ్యవస్థ అరకొర వసతులతో, ఉపాధ్యాయుల కొరతతో రోజురోజుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సర్దుబాటుతో అధిక అగాధంలో పడే అవకాశం ఉందని, ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ అనధికారిక రేషనలైజేషన్ చేస్తూ 1267 పేరున ఈనెల 20న ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రాథమిక పాఠశాలలో పటిష్టపరిచే దిశగా ఆలోచించాలని, ముందుగా బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేసి, తరువాత ఎక్కడెక్కడ ఖాళీలు ఏర్పడ్డాయో చూసి డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. డీఎస్సీ ఆలస్యమైతే విద్యా వాలంటీర్లను నియమించాలని, అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక పాఠశాలలు పటిష్టంగా ఉంటేనే ఉన్నత పాఠశాలలు బలంగా ఉంటాయని, ప్రాథమిక పాఠశాలలో 60 మంది వరకు ఇద్దరు టీచర్లు సరిపోతారని, 90 మంది వరకు ముగ్గురు టీచర్లు సరిపోతారని అసంబద్ధమైన ఉత్తర్వులు విద్యాశాఖ వెలువరించడం శోచనీయమని అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలంటే ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని, అప్పుడే ప్రాథమిక విద్య పునాదులు పటిష్టంగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వం అసంబద్ధంగా ఇచ్చిన సర్దుబాటు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనియెడల పీఆర్టయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

చిట్యాల ఐలమ్మ భారతరత్నకు అర్హులు



- ఆమె పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి
- రజక సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్

నవతెలంగాణ-గజ్వేల్

ఒక సాధారణ మహిళా భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా చిట్యాల ఐలమ్మ మారిందని ఆమెకు భారతరత్నకు పూర్తి అర్హురాలని, ఆమెకు ఇవ్వాలని రజక సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు రామ్ గారి శ్రీధర్ కోరారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం కట్టే కాలే వరకు తలవంచని వీర వనితగా పేరు తెచ్చుకున్నారని ఆయన గుర్తు చేశార వంగి దండాలు పెట్టే రోజుల్లో శివంగి గర్జించి ఐలమ్మ ఆమె కొంగు నడుముకు చుట్టుతే దొరతనం తోక ముడిచింది అన్నారు. కొడవలి చేత పడితే పీడిత జనం కడలిలా తరలివచ్చిందని పేర్కొన్నారు. ఆమె తెగింపుతోనే వెట్టిచాకిరి ముగింపుల కు వచ్చిందని ధరను ఢీకొనే వీర వనితగా పేరు తెచ్చుకుందన్నారు. బాంచన్ నీ కా ల్మొక్త అన్న జనం చేత బందుకు చేతపట్టించిందన్నారు. వెట్టి చాకిరి చేసేవారు అ లాగ జనం కాదు అని సహస్ర వృత్తులు చేసే సకల జనమని చాటిచెప్పిన ఘనత చాకలి ఐలమ్మ కే దక్కిందన్నారు. తెలంగాణ సాయుధ రైతన్న పోరాటంకి బలం పెంచింది ఐలమ్మనే అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ద్వారా ఎంతోమంది పేదలకు మేలు చేసిందని ఆమె త్యాగం వల్ల పోరాటం వల్ల ఎన్నో ఫలితాలు సాధించినట్లు ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి చాకలి ఐలమ్మకు భారతరత్న వచ్చేలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

హామీలు అమలు చేశాకే పరిశ్రమల నిర్మాణాలు చేపట్టాలి



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలో టీజీఐఐసీ నిర్మాణాలు చేపడుతున్న కంపెనీల వద్ద భూ నిర్వాసితులు రెండవ రోజు కూడా ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు కంపెనీల నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల నిర్మాణానికి వర్గల్ మండల కేంద్రంలో సుమారు 900 ఎకరాల భూమిని గత ప్రభుత్వం రైతుల నుండి సేకరించింది. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.10 లక్షల పరిహారాన్ని అందించి, ప్రతి రైతుకు నివాస స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటివరకు కొంతమంది రైతులకు మాత్రమే నివాసస్థల సర్టిఫికెట్లు జారీ చేసింది. లే ఔంట్ ని పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండా పనులను నిలిపివేశారు. కొంతమంది రైతులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అంది ఇవ్వలేక పోవడంతో భూ నిర్వాసితులు ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారంతో పాటు లేఅవుట్ పనులు పూర్తి చేసి రైతులకు కబ్జాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి సమగ్ర సర్వేలు నిర్వహించి భూనిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో కంపెనీల నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు గోవర్ధన్ రెడ్డి, నర్సారెడ్డి పసుల రమేష్, యాదగిరి, నందు, అంజయ్య, శివయ్య, దుర్గాప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

దుర్గేశ్ ఆశయాలను సాధిస్తాం



- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నమ్మిన సిద్ధాంతం కోసం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడు అమరజీవి గుంటిపెల్లి దుర్గేశ్ ఆశయాలను సాధిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో గుంటిపెల్లి దుర్గేశ్ 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు దుర్గేశ్ కుటుంబ సభ్యులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గడిపె మల్లేశ్ మాట్లాడుతూ దుర్గేశ్ అంటే ఒక ధైర్యం కొండంత బలం అని ఆయన మరణం సిపిఐకి అత్యంత తీరనిలోటని అన్నారు. దుర్గేశ్ కన్న కలలు నిజం చేయడం కొరకు ప్రతి సిపిఐ కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలకు అన్యాయం జరిగితే ముందుండి అడిగి న్యాయం కోసం నిలబడేది సిపిఐ ఎర్రజెండా ఒక్కటేనని గడిపె మల్లేశ్ అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజు కుమార్, సీపీఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, పొదిల కుమారస్వామి, మౌటం బాలయ్య, దుర్గేశ్ సతీమణి మాజీ సింగిల్ విండో డైరెక్టర్ గుంటిపెల్లి లక్ష్మి, సీపీఐ నాయకులు కాల్వలఎల్లయ్య, దొంతరవేని రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

పాల బిల్లులకు సీఎం సానుకూలం



- విజయ డెయిరీ రైతులకు ఆందోళన చెందవద్దు
- పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు మొగిలి జనార్దన్ రెడ్డి

నవతెలంగాణ-జగదేవపూర్

విజయ డెయిరీ పాల పాడి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని త్వరలోనే పెండింగ్లో ఉన్న పాల బిల్లులు ప్రభుత్వం చెల్లించనున్నట్టు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు మొగిలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన జగదేవపూర్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విజయ డెయిరీ పాల బిల్లులు పెండింగ్లో ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. ఇదే విషయాన్ని విజయ డెయిరీ చైర్మెన్ అమిత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడం జరిగిందని తెలిపారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని సీఎం సానుకూ లంగా స్పందించి తక్షణమే రూ. 50 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపా రు. బుధవారం పెండింగ్ పాల బిల్లులు రైతులకు చెల్లించడం జరుగుతుందన్నారు. మిగతా పాల బిల్లు డబ్బులు కూడా మంజూరు చేయను న్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో విజయ డెయిరీ పాడి రైతులకు మిగతా బిల్లులు విడతలవారీగాపాల బిల్లులు అందించ డం జరుగుతుందని, ఎవరు కూడా ఆందోళన స్పష్టం చేశారు.

గురుకులాల మెస్ చార్జీల కోసం మహాధర్నా



- గురుకుల మహాధర్నాను విజయవంతం చేయాలి
- టీఎస్యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి

నవతెలంగాణ- కొండపాక

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈరోజు టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దుద్దెడ సాంఘిక సంక్షేమ కళాశాలను సందర్శించి ఉపాధ్యాయుల సభ్యత్వాన్ని నమోదు చేయడం చేశారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలి డిమాండ్ చేశారు. గత 8 సంవత్సరాల నుంచి విద్యార్థుల మెస్ చార్జీలు పెంచకపోవడం శోచనీయమని అన్నారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలంటే మేస్చార్జిల్లు పెంచుతూ ఉత్తరువులను విడుదల చేయాలని అన్నారు. టీఎస్యూటీఎఫ్, గురుకులాల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారి పోరాటాన్ని కొనసాగించడం జరిగిందని తెలియజేశారు. ఈనెల 28వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాకు గురుకుల పాఠశాలను ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షులు వై శ్రీనివాస్, గురుకులాల జిల్లా కన్వీనర్ వి. కృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు పి.వాసు, చంద్రశేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు మేలు



- వ్యవసాయాధికారి డా.టి. నాగేందర్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్

రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా రైతులకు ఎరువుల కొరత లేకుండా చౌక ధరలకే అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయాధికారి డా.టి.నాగేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్లో రైతు ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయంలో ఎఫ్పీసీ కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఫర్టిలైజర్ తక్కువ ధరలకే దొరుకుతున్నయన్నారు.ఎలాంటి కల్తీ లేని మందులు ఎరువులు విత్తనాలు ప్రభుత్వ సమన్వయంతో మార్కెట్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచడం శుభ పరిణామన్నారు. ఈ ఎఫ్పీసీ ఏర్పాటు వల్ల రైతులకు అన్ని విషయాల పట్ల అవగాహన కల్పించడంతోపాటు స్వయంగా వారే యజమానులుగా భావించి ఆనందంగా ఆత్మగౌరవంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మంద నాగిరెడ్డి, హనుమంత రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సంతోష్, తదితరులున్నారు.

ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం కోసం వినతి



- మంత్రికి వినతిపత్రం అందజేత
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, టీపీసీసీ సభ్యులు కేడం లింగమూర్తితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రితో మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ప్రయివేటు కళాశాలలో సుమారుగా 350 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. బీసీ,ఎస్టీ హాస్టళ్లలో పరిమిత సీట్లు ఉండటం వల్ల ఎస్సీ విద్యార్థులను తీసుకోవడం లేదని, గతంలో చాలా సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ విషయాన్ని దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వసతి గృహన్నీ మంజూరు చేపించాలని కోరారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ త్వరలో హాస్టల్‌ను మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్యదర్శులకు వైద్య పరీక్షలు



- పనితో పాటు ఆరోగ్యం భద్రం
- ఎంపీడీఓ బి. యాదగిరి

నవతెలంగాణ-జగదేవపూర్

మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో నిత్యం ప్రజల ఆరోగ్యం నిమిత్తం పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులు పనితో పాటు తమ ఆరోగ్యం భద్రంగా ఉండేలా శ్రద్ధ వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి యాదగిరి అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలములోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు , జగదేవపూర్, తీగుల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ పరీక్షా కేంద్రాలను సందర్శించి పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం భద్రంగా ఉండాలని ఈ రోజు వైద్య పరీక్షలు నిర్వహించారని, ప్రతీ కార్మికుడు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

శాంతి భద్రతలు కాపాడటమే పోలీసుల విధి

- సీపీ అనురాధ



నవతెలంగాణ-చిన్నకోడూరు

శాంతిభద్రతలు కాపాడడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌ని మంగళవారం ఆమె సందర్శించారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులు తనిఖీ చేసిన అనంతరం శాంతి భద్రతల పరిరక్షణకు తగు సూచనలు చేశారు.స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. స్టేషన్ సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పంటల నమోదు ప్రక్రియ పరిశీలన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామంలో పంటల నమోదు ప్రక్రియను మంగళవారం డీఏఓ రాధిక క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. పత్తి పంటలో ఆశించిన రసం పీల్చు పురుగు, ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టా లని డీఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంతోష్, ఏఈఓ రచన పాల్గొన్నారు

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో మోడల్ స్కూల్లో గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హత కలిగి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీ, టెట్ అర్హత కలిగిఉన్న అభ్యర్థులు పీజీటీ- ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ, టీజీటీ, తెలుగు బోధించుటకు ఈనెల 25న ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్లో జరిగే డెమో క్లాసులకు తమ అర్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని అంతకపేట, చౌటపల్లి, అక్కన్నపేట, గొల్లకుంట, గ్రామాలలో మృతుల కుటుంబాలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, అంతకపేట గ్రామ శాఖ అధ్యక్షుడు కాశబోయిన రవి, ఉపాధ్యక్షులు శైలేంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షులు బండి రాజు, సల్లూరి జగదీష్, బండి నిఖిల్, రాజమౌళి, కొల్లా లక్ష్మారెడ్డి, రామంచ హనుమంత రెడ్డి, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్



నవతెలంగాణ-నంగునూరు

వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నంగునూరు మండలం రాజగోపాలపేట స్టేషన్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ సందర్శించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ ఏరియాను, పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్ట్ 2 మ్యాప్ ను పోలీస్ స్టేషన్‌లో ఉండే మాల్ రూం ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు పోలీస్ స్టేషన్ రికార్డ్స్ సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు.రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ లో ఓ గ్రామానికి చెందిన ఫిర్యాదు దారునితో నేరుగా మాట్లాడి అతని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ఐ, సీఐకి ఆదేశించారు. రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ లో పచ్చదనం పరిశుభ్రతతో చాలా బాగున్నాయని ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్బీఐ ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, రాజగోపాలపేట ఎస్ఐ ఆసీఫ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వరద నీరు...తడిసిన సామాన్లు



నవతెలంగాణ -ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రమైన ములుగు గ్రామంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పలువురు ఇండ్లలోకి చెరువును తలపించే విధంగా నీరు చేరి బియ్యం సామాన్లు, తదితర వస్తువులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.ములుగు గ్రామానికి చెందిన కమ్మరి శ్రీను, మోయిన్, మదర్, ఆశ గళ్ళ సురేష్, ప్రభాకర్, లక్ష్మణ్ పలువురి ఇండ్లలో పూర్తిగా నీరు చేరాయి. గత మూడు సంవత్సరాల క్రితం కురిసిన వాన మళ్లీ ఈరోజే కురిసిందని వారు అన్నారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

పొలం దగ్గర గడ్డికోస్తుండగా ప్రమాదవశాత్తు కేబుల్ వైరు తగిలి రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రఘోత్తం పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మంగళవారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం గౌరి అంజయ్య (71) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం తన పొలం వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు చూడకుండా కేబుల్ వైరు తెగి ఎడమ చేతికి తగిలింది. కరెంట్ షాక్ తో తన తండ్రి కొట్టుకోవడాన్ని గమనించిన నరేష్ షాటర్ డబ్బాలోని ఫ్యూసులు తీసేసి చూడగా అప్పటి మృతి చెందాడు. షాక్ కు గురైన మృతుడి తమ్ముడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృత దేహాన్ని పోస్ట్ మార్ట్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు


మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన డీసీఎం వ్యాన్



నవతెలంగాణ-కొండపాక

రోడ్డు దాటుతున్న మోటార్ సైకిల్ ను డీసీఎం వ్యాను ఢీ కొట్టిన సంఘటన కొండపాక మండలం దుద్దెడలో మంగళవారం చోటుచేసుకుంది. దుద్దెడ గ్రామానికి చెందిన వడ్డెర మహేందర్ గ్రామం నుంచి మోటార్ సైకిల్ పై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళున్న డీసీఎం ఢీ కొట్టింది. దాంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఫిర్యాదులో జాప్యం.. ఆందోళన చేపట్టిన గ్రామస్తులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకులపై విచారణ చేపట్టడంలో పోలీసు అధికారు లు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారంటూ మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ బాధితులు ఆందోళనకు దిగారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం గుడికందుల గ్రామస్తులు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయిం చిన నిరసనకు దిగిన ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గుడికందుల గ్రామంలో ఇద్దరు యువకులు మద్యం సీసాలతో ద్విచక్ర వాహనంపై సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయడం జరిగిందన్నారు . ఈ నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన గ్రామస్తులు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సై విచారణలో జాప్యం చేయడంతో పాటు, తమనే దూషించడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగామన్నారు. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను శాంతింప చేశారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సీపీఐ(ఎం)ను విమర్శించే అర్హత లేదు

- నాలుగు లక్షలకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవిని కొనుగోలు చేసింది నిజం కాదా
- సీపీఐ(ఎం)చేర్యాల మండల కమిటీ సభ్యులు రేపాక కుమార్



నవతెలంగాణ-చేర్యాల

అమాయకుల భూమిని అక్రమంగా ఆక్రమించిన చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్త్యాల గ్రామానికి చెందిన బైరగోని భానుగౌడ్‌కు సీపీఐ(ఎం)ను విమర్శించే అర్హత లేదని సీపీఐ(ఎం)చేర్యాల మండల కమిటీ సభ్యులు రేపాక కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముస్త్యాల సీపీఐ(ఎం)గ్రామ శాఖ ముఖ్యకార్యకర్తల సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి గుండ్ర రవీందర్‌తో కలిసి రేపాక కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అధికార కాంగ్రెస్‌ని అడ్డుపెట్టుకొని భూదాన్ భూములు, వెంచర్ భూములు, అమాయకుల భూములను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని ఆయన చేస్తున్న అవినీతిని సీపీఐ(ఎం) పార్టీ విమర్శిస్తే నీతి, నిజాయితీతో నిస్వార్ధంగా ప్రజల కోసం పోరాడు తున్న తమ పార్టీ నాయకుల మీద భానుగౌడ్ బురద చల్లే ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఇది దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అని అన్నారు. చేసిన ఆరోపణలు నిరూపించాలని, నిరూ పించలేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బైరగోని భానుగౌడ్ ముస్త్యాల గ్రామంలో అవినీతికి,అక్రమాలకు పాల్ప డుతున్న వ్యక్తి అని గ్రామానికి చెందిన నిరుపేద అవుసుల వెంకటేశం కు చెందిన మూడెకరాల భూమిని ఆక్రమించుకొని అక్రమంగా అనుభవి స్తున్నది, చేర్యాల మార్కెట్ డైరెక్టర్ పదవిని రూ. 4 లక్షలకు కొనుగోలు చేసింది నిజం కాదా అని అన్నారు. గ్రామంలో రియల్ బ్రోకర్ గా వ్యవహరిస్తూ అనేకమంది అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నది వాస్తవం కాదా ఇలాంటి నీచ మైన పనులు గ్రామంలో చేస్తూ కమ్యూనిస్టులను విమర్శించే నైతిక అర్హత లేదని, సీపీఐ(ఎం) సిద్ధాంతానికి కట్టుబడి నిరంతరం ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ పేదల పక్షాన న్యాయంగా పోరాడు తున్న నాయకులను, చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావోను విమర్శించే నైతికత, అర్హత లేదని, ఇప్పటికైనా వక్ర బుద్ధిని మార్చుకొని అమాయకులైన అవుసుల వెంకటేశం వద్ద ఆక్రమించిన భూమిని వారి కుటుంబానికి అప్పగించాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో చింతకింది దానయ్య, యాదారం బ్రహ్మయ్య, కర్ణ కంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ మంత్రి కోసం ఛలో హైదరాబాద్

- ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రి కేటాయించాలని ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఛలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్యంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, డైట్ బిల్లులు రాకుండా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లలో మౌలిక సదుపాయాలు లేక రాష్ట వ్యాప్తంగా విద్యార్థులు రోడ్ల మీదకి వస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల మహిళల పైన అకృత్యాలకు పెరుగుతున్నాయని అన్నారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కమిటీ సభ్యులు సంతోష్, అరుణ్ కుమార్, విజయ్, వెంకట్ సాయి, పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ



- మానవ తప్పిదం వల్లే ఎక్కువ ప్రమాదాలు
- చేర్యాల సీఐ ఎల్. శ్రీను

నవతెలంగాణ-చేర్యాల

వెయ్యి రూపాయల హెల్మెట్ విలువ కట్టలేని ప్రాణాన్ని రక్షిస్తుందని, మానవ తప్పిదం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. చేర్యాల పట్టణ కేంద్రంలో మంగళవారం మోటార్ సైకిల్ వాహనదారులకు హెల్మెట్ వినియోగం గూర్చి ఎస్ఐ పీ. నీరేష్ తో కలిసి సీఐ శ్రీను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ పెట్టుకుని మోటార్ సైకిల్ నడిపిన వాహనదారులను ప్రోత్సహించే విధంగా ఆపిల్స్ అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు .హెల్మెట్ మన ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు, సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వాహనదారుల్లో ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణ గురించి రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రమే జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు.

పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం

- తొగుట సీఐ షేక్ లతీఫ్



నవతెలంగాణ-రాయపోల్

యువత పట్టుదలతో కృషి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని ఎన్నో రంగాలలో అవకాశాలు ఉన్నాయని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. సోమవారం రాత్రి రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్ ఆధ్వర్యంలో పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్ చైర్మెన్ రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం నిర్వహిస్తున్న పదవ తరగతి అర్హతతో ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు అవగాహన సదస్సుతో గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువత అవగాహన పెంచుకొని డిఫెన్స్ రంగంలో రాణించి, వారి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డిఫెన్స్ రంగమైన అర్ధ సైనిక బలగాలు, సివిల్ పోలీస్ విభాగాలలో జాయిన్ కావడానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని పేర్కొన్నారు. ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మెన్ రిటైర్డ్ ఆర్మీ నీల చంద్రం మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి వీలైనంత ఎక్కువ మందిని డిఫెన్స్ రంగంలోకి పంపాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ సదస్సునీ ఉపయోగిం చుకొని, అగ్నిపథ్ స్కీమ్ గురించి సమాజంలో ఇంకా విస్తృతంగా అవగాహన పెంచాలని గ్రామ ప్రజల్ని కోరారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ఏఎస్ఐ అమృత్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఆజాద్ డిఫెన్స్ అకాడమీ కన్వీనర్ మహమ్మద్ షఫీ, మెదక్ పార్లమెంట్ బీజేపీ ఎస్సి మోర్చా ఇంచార్జ్ మంగిడి స్వామి, గ్రామ బీజేపీ అధ్యక్షులు బాలమల్లు ముదిరాజ్, ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- పంచాయతీ అధికారి దేవకీదేవి



నవతెలంగాణ-కొండపాక

పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. కొండపాకలో మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి దోమలు రావన్నారు. అపరిశుభ్రతతో అనారోగ్యం పాలవుతామ న్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి పొడి చెత్త పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-చేర్యాల

వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని ఎంతోమంది నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఒక వరం లాంటిదని చేర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో పట్టణ కేంద్రం మూడో వార్డుకు చెందిన చింతల శ్యామలకు మంజూరు అయిన రూ.15 వేల సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాన్ని మంగళవారం శ్యామలకు మంగోలు చంటి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీ ద్వారా వైద్యం చేయించుకోవచ్చని, తెల్ల రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న పేదవారు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు అని తెలిపారు. బాధితురాలు, మంగోలు చంటి ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ - కొండపాక



కొండపాక గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఐదుగురు అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ తదితరులున్నారు.

చేనేత పనిలో నైపుణ్యాభివృద్ధి కోసమే "సమర్థ" పథకం

- చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుగలేంతి



నవతెలంగాణ- దుబ్బాక

ఆధునికత సాంకేతికతతో చేనేత పనిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందిండంతో పాటు చేనేత రంగంలో ఉపాధి అవకాశాల్ని కల్పించడం కోసమే కేంద్ర ప్రభుత్వం "సమర్థ" పథకాన్ని తెచ్చిందని చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుగలేంతి అన్నారు. 45 రోజుల శిక్షణలో చేనేత పనిలో సరికొత్త మెలకువలు, నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవడంతో పాటు ఉపాధి పొందవచ్చన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో దుబ్బాక చేనేత సహకార సంఘం, దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమర్థ పథకాన్ని ఆయన ప్రారంభించారు.అనంతరం అభ్యర్థులకు పెన్నులు, బుక్కులు,పెన్సిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖ అధికారులు బాలాజీ,సంతోష్ కుమార్,పవన్ కుమార్, చేనేత సంఘం నిర్వాహకులు గాజుల భాస్కర్,మాజీ చేనేత సంఘం అధ్యక్షుడు బోడ శ్రీనివాస్, పలువురున్నారు.

కళాశాలలోని నీటి సమస్యను పరిష్కరించండి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్ లో నీటి సమస్యను పరిష్కరించాలని సిద్దిపేట్ కలెక్టర్ ఏవో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంగళవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర బాయ్స్ ఎడ్యుకేషన్ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి మాట్లాడుతూ కనీస అవసరాలకు సరిపడా త్రాగునీరు కానీ, వాడుక కోసం సాధారణ నీరు కానీ సరిపడా లేకపోవడం వల్ల విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. సమస్యలు పరిష్కరించే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాము. లేనియెడల విద్యార్థులతో హైదరాబాద్ వెళ్ళే రోడ్డును దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మధు, పట్టణ నాయకులు శ్రావణ్, వినయ్ అలాగే గజ్వేల్ నాయకులు వేణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేలంలో లడ్డులను దక్కించుకున్న పలువురు





నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో భగత్ సింగ్ యూత్ నవరాత్రులు పూజలు అందుకున్న మహా గణపతి విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన లక్కీ డ్రాలో లడ్డు మాజీ జెడ్పీటీసీ రాంచంద్రం యాదవ్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు గ్రామస్థులు ,తదితరులున్నారు.

మర్కుక్‌లో

మండల కేంద్రమైన మర్కుక్ లో గల సంకట విమోచన హనుమాన్ దేవాలయ వద్ద నవరాత్రి పూజలు అందుకున్న గణపతి లడ్డు సోమవారం రాత్రి వేలం పాట నిర్వహించారు.ఈ వేలం పాటలో శాతం గారి శివ కుమార్ గౌడ్ రూ. 81 వేలకు దక్కించుకున్నాడు.ఈ కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సాయిరెడ్డి, దామోదర్ రెడ్డి, తదితరులున్నారు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



నవతెలంగాణ-నంగునూరు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని, విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకుంటే వారి శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ బాల్యంలో క్రీడలను పట్టించుకోకపోవడం వల్ల మానసిక శారీరక అనారోగ్య సమస్యలు ఏర్పడు తున్నాయన్నారు. బాల్యంలో క్రీడల్లో పాల్గొనే వ్యక్తులు శారీరకంగా దృఢంగా ఉండడమే కాక, మానసికంగా ఎంతో పరిణతి చెందుతారని తెలిపారు. ఫలితంగా ఎలాంటి సమస్యలను అయినా ధైర్యంగా ఎదుర్కొంటారని చెప్పారు. విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వడం వల్ల మన దేశం కంటే తక్కువ జనాభా కల్గిన దేశాలు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో ముందంజలో ఉండగా మన దేశం వెనుకబడిందని చెప్పారు. విద్యార్థులు క్రీడలను స్నేహపూర్వక వాతావరణం లో ఆడి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకుని స్నేహభావాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు నాగర్జునరెడ్డి, శ్రీనివాస్,వ్యాయామ ఉపాధ్యాయు లు రాజమౌళి, తడకంటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటుతో ప్రభుత్వ విద్య దూరం



నవతెలంగాణ-దుబ్బాక

పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేసేలా ఉన్న టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే ఉపసంహ రించుకోవాలని టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అమ్మన నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలం చెల్లిన నిబంధనల్ని నేటికీ అమాలు చేయడం సరికాదన్నారు. ఈ ఉత్తర్వులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతారని. దీంతో విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు.



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రాథమిక పాఠశాలల మనుగడకు విఘాతం కలిగించేల తీసువచ్చిన జీఓ 25ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ మంగళవారం డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి స్కావెంజర్స్ నిధులు విడుదల చేయాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడు నారోజు శంకరాచారి, ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్, శ్రీదేవి,ధనలక్ష్మి పాల్గొన్నారు

ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నంగునూరు

సంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.మానయ్య తెలిపారు. హావర్ బేస్ట్ టీచర్ క్రింద పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ జువాలోజీ -1 పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఫిజికల్ సైన్స్ -1, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ బాటనీ-1, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ సివిక్స్-1, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ మ్యాథమటిక్స్ -2, ట్రేన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ సోషల్ -1 ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 25 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

జోగిపేట, సంగారెడ్డిలో శౌర్య యాత్ర దృశ్యమాలిక





















సమాజసేవలో యువత ముందుండాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

పరుల సేవయే సమాజసేవగా భావించి యువత ముందుకు రావాలని ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి విద్యార్థులు, యువతకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు యువత బాధ్యతతో ఉండి సమాజసేవకు ముందుకు రావాలన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో సేవా తత్పరతను పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం అని ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు, విజన్, మిషన్లను విద్యార్థులకు అవగతం చేశారు.ఈ కార్యక్రమ నిర్వాహకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఆకుల వెంకటేశం మాట్లాడుతూ.. వాలంటీరిజం అంటే నిష్పక్షపా తంగా సేవ చేయగల తత్వమని, అందుకు ఎల్లప్పుడూ సిద్ధం గా ఉండి ప్రతి ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా జీవన



కలలు పెంపొందించుకోవచ్చు అని తెలి పారు. ఈ సందర్భంగా స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు అవా ర్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కరుణ కుమారి, డాక్టర్ సుజాత, షరీఫ్ మియా, డాక్టర్ మంజుశ్రీ, డాక్టర్ పూనమ్, శివ దీప్తి, వెంకటేశ్వర్లు, కాసీం విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్ ఆర్మీ జిల్లా కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షులు వినయ్ రతన్‌సింగ్ సోమవారం జహీరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా హుగెళ్ళి చౌరస్తా నుండి పట్టణం లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ పరిధిలోని పస్తాపూర్‌లో సంగారెడ్డి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటే సామాజిక సంఘాలు భీమ్ ఆర్మీతో కలిసి ప్రతిఘటించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ దేశ ప్రజల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు వనం మహేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలపతి రావు, చీఫ్ సెక్రటరీ పప్పుల లక్ష్మీ నారాయణ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు తీగల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయొద్దని ఎంపీకి వినతి

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి గ్రామ పరిధిలో గల ప్యారానగర్ లో ఏర్పాటు చేయనున్న గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి డంపింగ్ యార్డును తక్షణమే నిలిపివేయాలని కోరుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎంపీ రఘునందన్ రావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఎంపీతో మాట్లాడుతూ.. అటవీ, పచ్చటి వాతావరణంతో కూడిన గుమ్మడిదల మండలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో పూర్తిగా కలుషితమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోవడమే కాక మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు పలుగు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులను మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేయకుండా తక్షణమే పనులను నిలిపివేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపీ..



సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకొని డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిపివేయాలని శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దోమడుగు శంకర్, శ్రీనివాస్, నాయకులు దేవేందర్ రెడ్డి, ఉదయ్ కుమార్, రవీందర్ రెడ్డి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, ఆకుల సత్యనారా యణ, మాధవ రెడ్డి, సూర్యనారాయణ, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వెలగని వీధిలైట్లు, ఇబ్బందులు పడుతున్న ప్రజలు

- పెద్ద చెరువు కట్ట నుండి అయ్యప్ప గుడి వరకు వెలుగని వీధి దీపాలు

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కట్ట నుంచి అయ్యప్ప గుడి వరకు ఉన్న వీధి దీపాలు రాత్రి సమయంలో వెలగడం లేదు. సుమారుగా 30 వీధి దీపాలు వెలుతురునివ్వకుండానే ఉండిపోయాయి. అయ్యప్ప గుడి ముందర కొన్ని వీధిదీపాలు మాత్రమే వెలుగుతూ, అందులో మరికొన్ని రెండు బల్బులకు బదులుగా ఒక బల్బు మాత్రమే వెలుగుతుంది. 44వ జాతీయ రహదారి నుంచి తూప్రాన్ పట్టణానికి ప్రధాన రహదారిగా ఉన్న డివైడర్లపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలుగుకకపోవడంతో రాత్రి సమయాల్లో అటువైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలుతురునిచ్చేటట్టుగా సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సేవా దృక్పథమే ఎన్ఎస్ఎస్ ప్రధానోద్దేశ్యం

- జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు దేవస్వామి
- కళశాలలో ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-బెజ్జంకి

ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన సమాజానికి సేవ చేయడంలోనే జీవితానికి స్వార్థకత ఉంటుందని..సేవా దృక్పథమే ఎన్ఎస్ఎస్ ప్రధానోద్దేశ్యమని జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు దేవస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్బావ దినోత్సవ వేడుకలు కో అర్డీనేటర్ ప్రవీన్ రెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ అక్షరమాల ఆకారంలో ప్రదర్శన నిర్వహించడం ప్రత్యేకార్షణగా నిలిచింది.కళాశాల భోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీసీసీని కలిసిన చక్రధర్ గౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు కాంగ్రెస్ నాయకులు గాధగోని చక్రధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో మహేష్ గౌడును కలిసి సన్మానించినట్లు తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ సమస్యలపై, స్థానిక రాజకీయ అంశాలపై ఆయనకు వివరించినట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



నవతెలంగాణ-వర్గల్

పేద విద్యార్థులకు తమ వంతు సహాయం చేయడంలో సంతృప్తి ఉందని ఎంఎస్ వ్యవస్థాపక చైర్మెన్ ఇలాసాగర్ మహేష్ బాబు అన్నారు. వర్గల్ మండలం గుంటుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోజున 80 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతోమంది నీరు పేదలకు సహాయం చేయడం తనకువిత్రుప్తిని ఇస్తుందని అన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలోని ప్రిన్సిపాల్ నిర్మలదేవి, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, రాజు, శారదా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండల్ రెడ్డితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణంకు భారీ విరాళం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన గౌరిశెట్టి ఉమాదేవి సత్యనారాయణ దంపతులు విరాళంగా రూ. 1,00,116 లు దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి భక్తులు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని, విరాళాలు ప్రకటించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మహిళా సంఘాలకు రూ.6 కోట్ల చెక్కు అందజేత



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మహిళ సమైక్య సంఘాల రుణాల కోసం మంగళవారం హుస్నాబాద్ ఐకెపి కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ బి బాల నాగు మహిళా సంఘాలకు రూ. 6 కోట్ల చెక్కును అందజేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కట్కూ ర్ బ్రాంచ్ పరిధిలోని 32 సంఘాలకు రూ.6 కోట్లు చెల్లించనున్నట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, ఏపీఎం శ్రీనివాస్ , సీసీలు శివ, గిరిమల్ల రాజు, తిరుపతి, ప్రసాద్ సిఏలు పాల్గొన్నారు

బీజేపీ గీతా సెల్ జిల్లా కో కన్వీనర్ ఏన్నిక



నవతెలంగాణ-మిరుదొడ్డి

బీజేపీ గీతా సెల్ జిల్లా కో కన్వీనర్‌గా మిడిదొడ్డి మం డలం మల్లుపల్లి గ్రామానికి చెందిన అన్నెబో యిన ఆశాగౌడ్ ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు . మంగళవారం ఆయన మాట్లాడుతూ..సోమవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఎంపి మాధవ నేని రఘునంధన్ రావు సహకారంతో గీతా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ వెంకటేష్ గౌడ్ ఆద్వర్యంలో నాపై నమ్మకంతో నన్ను ఎన్నుకున్నందుకు ఎల్లవేళలా బీజేపీ పార్టీ ఆద్వర్యంలో కార్మికులకు పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన బీజేపీ పార్టీకి ఎంపీ మాధవ నేని రఘునంధన్ రావుకు., గీతా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ వెంకటేష్ గౌడ్ కు, ఒబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేశ్ గౌడ్ రాష్ట్ర కొ కన్వీనర్ కిరణ్ కుమార్ గౌడ్ కు, మిరుదొడ్డి మండల బీజేపీ పార్టీ కుటుంబ సభ్యులకు పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

విరిగిన చెట్లు తొలగింపు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చేర్యాల నుంచి కడవేరుగు, చేర్యాల నుంచి చుంచనకోట గ్రామాలకు వెళ్లే రోడ్లపై అడ్డంగా చెట్లు విరిగి పడడంతో సమాచారం అందుకున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ పీ నీరేష్ చెట్లు విరిగి పడిన ప్రాంతాలకు వెళ్లి స్థానికుల సహాయంతో రోడ్లకు అడ్డంగా విరిగి పడిన చెట్లను తొలగించి రోడ్లను క్లియర్ చేశారు.

విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

-కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ కె యాదగిరి.



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా భావాన్ని పెంపొందించుకొవాలని అన్నారు. చదువుతోపాటు విద్యార్థులు సేవాభావాన్ని సమాజాన్ని చైతన్య పరిచే కార్యక్రమాలు విద్యార్థులు చేపట్టాలని సమాజంలో మార్పులు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వడ్డేపల్లి రాజమౌళి, యు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, నీరజ, రజిత, అశోక్ ,సీతారామయ్య, నరేష్, రాజేశ్వర్ రెడ్డి, లైబ్రేరియన్ సుజాత విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను మంగళవారం తెలంగాణ భవన్ హైదరాబాద్‌లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. ప్రస్తుతం నియో జకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహం పార్టీకి క్యాడర్ ను చేయాల్సిన సమాయత్తంపై మాజీ మంత్రి కేటీఆర్ తో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే సతీష్ తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కువ మంది పట్టభద్రులను ఎన్రోల్ చేయించాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్న విధంగా పనిచేయాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించాలని, పలు కీలక అంశాలను మాజీ మంత్రి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు.

హైడ్రాతో దొరల గుండెల్లో భయం



- గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్

నవతెలంగాణ-గజ్వేల్

పదేళ్లుగా తెలంగాణలో పరిపాలించి తప్పిదాలను చేసిన దొరలు కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ గుండెల్లో హైడ్రా భయం పుట్టిస్తుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. మంగళవారం గజ్వేల్ లో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన తప్పుడు నిర్ణయాల వల్లే ఇప్పుడు పేదలు కష్టాలు అనుభవిస్తున్నారని ఆ పైగా కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ నేతలు దుమ్మెత్తి పోయడం సిగ్గుచేటు అన్నారు. ఇష్టానారంగా అనుమతులు ఇచ్చి జేబులు నింపేసుకున్నారని ఆయన విమర్శించారు. హైడ్రా ప్రయోగంతో జంట నగరాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మంచిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శునకానందం పొందుతున్నట్లు ఆయన అన్నారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ అక్రమ కబ్జాలకు నోటీసులు ఇచ్చి దండుకోగా, ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కబ్జాలు, అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పై దుమ్మెత్తి త్తిపోస్తున్నట్లు విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ భూములు, సహజ వనరుల సంరక్షణకు హైడ్రాను గ్రామాలకు విస్తరించాలని కోరారు. అయితే వారి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై దర్యాప్తు వేగవంతం చేసినందునే అసత్య ఆరోపణలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టి చెప్పు చేతుల్లో ఉంచుకుంటుండగా, ప్రజలు మాత్రం వారి మాటలను విశ్వసించడం లేదని వివరించారు.

ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశం సామాజిక సేవ



- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-మద్దూరు

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పితామహుడు డాక్టర్ బి.కే.ఆర్.వి.రావు చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం కళాశాలలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య తో పాటు సామాజిక సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు, విద్యార్థులు నాయకత్వం లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. జాతీయ సమైక్యతను పెంపొందించుకోవడానికి విద్యార్థులు విద్యతో పాటు జాతీయ సేవాలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానవసేవే ధైవంతో సమానం



నవతెలంగాణ- గజ్వేల్

మానవసేవే ధైవంతో సమానం అని బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గణపతి రావు అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బాలుర విద్యా సౌధంలోని ప్రభుత్వ డిగ్రీ (కో ఎడ్యుకేషన్) కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవ చేయడం అంటే దైవానికి సేవ చేయడమే అని అన్నారు. రోజురోజుకీ సైన్స్ అండ్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ పర్యావరణం అత్యంత ప్రమాదకరంగా మారుతుంది అన్నారు. ఒకనాటి సాంఘిక దురాచారాల కన్నా నేడు ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరంగా మారిందన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. చెట్లను సైతం ఎవరికి వారు విచక్షణారహితంగా నరకడాన్ని నిలువరించ డానికి ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. నేడు నీటిని సైతం విచక్షణారహితంగా వినియోగిస్తునామన్నారు భవిష్యత్తులో రాబోయే నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి, భూగర్భ జలాలను కాపాడుకోవడానికి ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత తీసుకొని దాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రజలలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినే టర్ వెంకటేశం, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్స్ విజయ భాస్కర్ రెడ్డి, డా. వై రామచం ద్రం, డా. పెద్దిరాజు , అకాడమిక్ కోఆర్డినేటర్ జె. లక్ష్మి నరసయ్య, వి. మార్క ండేయ, శ్రీధర్, శివ, నరేష్, పద్మ, ఎన్.ఎస్.ఎస్ విద్యా వాలంటీర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

హరీశ్ రావు కృషితో విద్యాక్షేత్రంగా సిద్దిపేట

- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి



నవతెలంగాణ-సిద్దిపేట

హరీశ్ రావు కృషితో సిద్దిపేట విద్యా క్షేత్రంగా వెలుగొందుతుందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలల బీఆర్ఎస్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జూనియర్ కళాశాల బాయ్స్ కమిటీ అధ్యక్షులుగా సాంద్ర అభిలాష్, ఉపాధ్యక్షులుగా నిఖిలేశ్వర్ రెడ్డి, కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా సాయి చరణ్, గర్ల్స్ కమిటీ అధ్యక్షురాలుగా చింతల అక్షయ, ఉపాధ్యక్షురాలుగా అనూష, చందన, ప్రధాన కార్యదర్శిగా శిరీష, కళాశాల ఉమ్మడి సమన్వయకర్తగా కొమ్మిడి సూర్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిద్దిపేట రూరల్ మండలం అధ్యక్షులు బండి శ్రీకాంత్, చిన్న కోడూరు మండల అధ్యక్షులు గుజరాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి భానుచందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల ఉపాధ్యక్షులు గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ జానకి చందు, నాయకులు రజినీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్‌కు అవార్డుల పంట



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు 25 అవార్డులను అందించినట్లు వాసవి క్లబ్ రీజియన్ చైర్మెన్ మంకాల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి మాట్లాడుతూ స్థానిక వైశ్య భవన్‌లో జరిగిన వాసవి క్లబ్ రికాన్ కార్యక్రమంలో 25 పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం, నిరుపేదలకు కుట్టు మిషన్ల పంపిణీ, పుస్తె మట్టెల పంపిణీ, దాతల సహకారంతో నిరుపేద వధువుకు వివాహం చేయడం, సిమెంట్ బెంచీలు, వాటర్ ట్యాంకుల అందజేత, పేదలకు పింఛన్లు పంపిణీ వంటి కార్యక్రమాలకు అవార్డులు వచ్చినట్లు తెలిపారు. సూపర్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు సిల్వర్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్‌గా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధి రాజేష్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్, వివిధ క్లబ్ల అధ్యక్షులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.